Rs. 12/- per copy

# విద్యార్థి జ్వాల

Vol. 32 - No.1
February 2026



*ఇందుకు మీరు పిలువబడితిరి. క్రీస్తు కూడా మీకొరకు బాధపడి, మీరు తన అడుగుజాడల యందు నడుచుకొనునట్లు మీకు మాదిరి యుంచిపోయెను. ఆయన పాపము చేయలేదు; ఆయన నోటను ఏ కపటమును కనబడలేదు.*

– 1 పేతురు 2:21,22



పవిత్రీకరించుకో...



అనుకరించు...



ప్రేరేపించు...

లేఖ

# స్పైకాన్ తర్వాత ఏమి చేయాలి?

ప్రభువు నందు ప్రియమైన సహోదర, సహోదరీలకు... మన ప్రభువును, రక్షకుడైన యేసుక్రీస్తు నామంలో శుభములు తెలియజేస్తున్నాను. మన రాష్ట్రంలోని ఏడు ప్రాంతాల్లో జరిగిన స్పైకాన్స్‌కు మీరందరూ ప్రార్థనాపూర్వకంగా, ఎంతో ఉత్సాహంగా పాల్గొన్న దాన్నిబట్టి దేవునికి వందనాలు చెల్లిస్తున్నాను. మనందరి ప్రార్థనల వల్ల దేవుడు తన కృపను, కాపుదలను మనందరి పక్షాన ఉంచి స్పైకాన్స్‌ను మంచిగా జరిగించిన దాన్ని బట్టి దేవునికి కృతజ్ఞులం. ఈ స్పైకాన్స్ కోసం కాన్ఫరెన్స్ కమిటీలు, స్థానిక ఏర్పాట్ల కమిటీ సభ్యులు, యుఇయస్ఐ-ఏపి ఆఫీస్ బేరర్స్, అలాగే ఎంతోమంది విద్యార్థులు, స్టాఫ్, గ్రాడ్యుయేట్స్ తమ గృహాలను తెరిచి, ప్రయాసపడుతూ, తమ సమయాన్ని, ధనాన్ని, తలాంతులను ప్రభువు పనిలో వెచ్చించారు. వీరందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. “కాగా నా ప్రియ సహోదరులారా, మీ ప్రయాసము ప్రభువునందు వ్యర్థము కాదని యెరిగి, స్థిరులును, కదలనివారును, ప్రభువు కార్యాభివృద్ధియందు ఎప్పటికిని ఆసక్తులునై యుండుడి.” (1 కొరింథీ 15:58).

స్పైకాన్స్ తర్వాత మనం ఏం చేయాలో కొన్ని ప్రాముఖ్యమైన విషయాలు మీకు గుర్తు చేయాలని ఆశిస్తున్నాను. సభ్యులందరూ వీటిని శ్రద్ధతో చదివి, అవగాహన చేసుకొని, వీటి అమలు కొరకు వ్యక్తిగతంగా, ఇయు, ఇజియఫ్‌లుగా ప్రతిదినం ప్రార్థిస్తూ, తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

**1. దేవుని స్తుతిద్దాం:** స్పైకాన్స్ గురించి కొన్ని నెలల నుండి మనం ఎంతో ప్రార్థించాం, వాటికి సిద్ధపడ్డాం. దేవుడు వాటిని మంచిగా జరిగించాడు. అనుకూల సమయాన్ని, వాతావరణాన్ని, స్పీకర్స్‌ను, థీమ్‌ను, కాపుదలను ఇచ్చి అవసరాలన్నీ తీర్చినదాన్ని బట్టి, అందరూ వచ్చి ఆత్మీయ మేలులు పొందిన దాన్ని బట్టి దేవునిని స్తుతిద్దాం. “దేవుని నమ్మకత్వం ఎన్నడూ విఫలం కాదు. మనం ఆయన కార్యాలను చూసినప్పుడు, మన హృదయం ఆయన మంచితనాన్ని స్తుతించకుండా ఉండలేదు” అని అంటాడు హడ్సన్ టేలర్.

**2. ఇజియఫ్‌లో షేరింగ్ పెట్టుకొందాం:** స్పైకాన్‌లో దేవుడు మాట్లాడిన విషయాలను గూర్చి స్థానిక ఇజియఫ్‌లలో షేరింగ్ పెట్టుకొంటే మంచిదని భావిస్తున్నాను. హాజరైన ప్రతి ఒక్కరితో దేవుడు అనేక విషయాలు మాట్లాడి ఉంటాడు. ఈ విషయాలను ఇజియఫ్‌లో షేర్ చేసుకొంటే మిగిలిన వారికి, హాజరు కానివారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. ఒకరి అనుభవం, మరొకరికి ప్రేరణ కావచ్చు, నూతన వెలిగింపు కావచ్చు, ప్రభువును మరింత సన్నిహితంగా వెంబడించడానికి దోహదపడవచ్చు.

**3. విన్న సందేశాల్ని జ్ఞాపకం చేసుకొందాం:** ఎక్స్‌పోజిషన్స్, డివోషన్స్, ప్లీనరీస్, సెమినార్స్‌ను కాన్ఫరెన్స్‌లో విన్నా మరలా వాటిని జ్ఞప్తికి తెచ్చుకొని జాగ్రత్తగా మన జీవితాన్ని పరిశీలించుకోవడం ఎంతో అవసరం. గనుక సమయం చూసుకొని వ్యక్తిగతంగా వీటిపై శ్రద్ధ పెడదాం. మనం సావనీర్‌లో రాసుకొన్న విషయాలను మరలా చూద్దాం. ఈ సందేశాల్ని స్పీకర్స్ ఎంతో ప్రార్థనాపూర్వకంగా సిద్ధపడి అందించారు.

**4. తీసుకొన్న నిర్ణయాలకు కట్టుబడి ఉందాం:** ఇంత ప్రణాళిక, ప్రయాస, ఖర్చుతో ఈ స్పైకాన్స్‌ను నిర్వహించింది మన జీవితాల్లో మార్పు రావాలనే. మార్పు ఎప్పుడు సాధ్యమంటే మనం తీసుకొన్న నిర్ణయాలకు కట్టుబడి జీవించినప్పుడే. లేకపోతే మనం ఆచార క్రైస్తవులుగా, కాన్ఫరెన్స్ క్రైస్తవులుగా మిగిలిపోయే అవకాశం ఉంది. మనం స్పైకాన్స్‌లో తీసుకొన్న నిర్ణయాలు మన జీవితాల్లో నెరవేరాలంటే అవి మన ప్రార్థనాంశాలుగా మారాలి. అలా జీవించేలా ప్రతిదినం ప్రయత్నించాలి.

**5. స్థానిక పరిచర్యలో చురుకుగా పాల్గొందాం:** క్యాంప్స్‌కు, కాన్ఫరెన్స్‌లకు చాలామంది వస్తున్నారు. కానీ స్థానిక పరిచర్యలో పాల్గొనేవారు మాత్రం చాలా తక్కువమంది ఉంటున్నారు. ఈ అనవాయితీ మంచిది కాదు. ఎంతో ఉత్సాహంతో ఈ స్పైకాన్స్‌కు వచ్చిన వారందరూ, అదే ఉత్సాహంతో స్థానిక పరిచర్యలో పాల్గొంటే ఎంత బాగుంటుంది! నశించిపోయే అనేకమంది విద్యార్థులను త్వరగా చేరుకోవచ్చు. ఆలోచిద్దాం, ప్రార్థిద్దాం, ప్రభువు పనిలో పాల్గొందాం. ఇది కొందరి పనికాదు, మనందరిది గనుక ప్రభువిచ్చిన దర్శనంతో ముందుకు వెళదాం.

**6. స్పైకాన్ లక్ష్యాలు సంపూర్ణంగా నెరవేరేటట్లు ప్రార్థిద్దాం:** ఈ స్పైకాన్ లక్ష్యాలు కేవలం స్పైకాన్‌కు పరిమితమై, తర్వాత ముగిసేవి కాదు. మనలో, మన పరిచర్యలో నెరవేరాల్సినవి గనుక వీటి నెరవేర్పు కోసం వ్యక్తిగతంగా ప్రార్థిద్దాం.

1. నాణ్యమైన ప్రార్థనా జీవితం, వాక్యపఠనం ద్వారా దేవునిలో ఎదుగుతూ, నశించిపోతున్న కళాశాల విద్యార్థులను క్రీస్తు కొరకు సంపాదించే విధంగా ప్రోత్సహించడం.
2. ప్రస్తుతం విస్తృతమవుతున్న లైంగిక పాపం పట్ల జాగ్రత్తగా ఉండమని హెచ్చరిస్తూ, వ్యక్తిగత, కుటుంబ జీవితాలను కాపాడడం.
3. మనలోని ఏకత్వాన్ని భంగపరచడానికి ప్రయత్నించే దుష్టుని వ్యూహాలను ఎదుర్కోవడానికి, సభ్యులు విధేయులుగా ఉండి, ఆత్మతో నిండిన జీవితాలను గడపడానికి మార్గనిర్దేశం చేయడం.
4. ప్రేమ, వినయంతో ఒకరికొకరు సేవ చేసే విధంగా సభ్యులను ప్రోత్సహించడం, తద్వారా యుఇయస్ఐ దర్శనాన్ని నెరవేర్చడం.
5. దైవిక జ్ఞానం, ధైర్యంతో హింసను ఎదుర్కోవడానికి సభ్యులను సిద్ధపరచడం.

– కె. రాజశేఖర్, బాపట్ల,
సెక్రటరీ, ఎగ్జిక్యూటివ్ కమిటీ, యుఇయస్ఐ-ఏపి




Vol. 32, No. 1. February 2026
A Publication of
Union of Evangelical Students of India

EDITORIAL BOARD:
Mr. R. Srinivasa Rao - Publisher
Mr. P. Sunil Jacob - Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana - Member
Mr. C. Paul Pramod - Member
Mr. K. Adam - Sec., PT
Mr. P. Ramaswamy - Sec., Lit.Dept.

SUBSCRIPTION CHARGES:
STUDENTS (1 Year) - Rs. 150
GRADUATES (1 Year) - Rs.300
STUDENTS (3 Years) - Rs. 400
GRADUATES (3 Years) - Rs.850
STUDENTS & GRADUATES (10 Years) Rs. 2000/-

FOR SUBSCRIPTION:
The prescribed subscription charges can be paid using the account / UPI ID / QR code, fill the details in the google form (https://bit.ly/SubscriptionForVJ) and inform the same to Editor VJ through whatsapp.

**Account Name : UESI Publication Trust, Andhra Pradesh**
**Account No : 43362371247,**
**SBI Nambur Branch**
**IFSC: SBIN0011994**
**Merchant Name: UESI PUBLICATION TRUST ANDHRA PRADESH**
**UPI ID : uesiptap@sbi**

CONTACT:
The Editor
Vidyardhi Jwala,
UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com

# శ్రమల్లో విధేయత చూపించాలి, రాజీపడకూడదు

క్రైస్తవ ప్రయాణంలో సంపూర్ణత కొరకైన పరీక్షలు, శ్రమలు ఎదుర్కొంటూ ముందుకు వెళుతున్నప్పుడు వాటిని తప్పించుకోవడానికి, అధిగమించడానికి అనేక దొడ్డిదారులు ఉంటాయి. ప్రజలు కూడా మనకు అనేక సలహాలు ఇస్తారు. మీరు ఈ శ్రమల గుండా ఎందుకు వెళుతున్నారు, దానికి ఈ మార్గం గుండా వెళ్ళవచ్చని, విలువలతో కొంచెం రాజీపడితే సరి పోతుందని, ఎందుకు నీ జీవితాన్ని కష్టాలపాలు చేసుకొంటావు? అని అంటారు. ఇలాంటి సందర్భాల్లో దేవుని మార్గంలో వెళ్ళాలా, సులభమైన మార్గంలో వెళ్ళాలా అనే రెండు దారులు మనముందుండి నిర్ణయించుకోవడం కష్టంగా ఉంటుంది. మనం ఏ వైపు ఉంటామా అని దేవుడు చూస్తుంటాడు. ఇలాంటి క్లిష్టమైన సమస్యల్లో వెళ్తున్నప్పుడు మనం దేవునికి విధేయత చూపించాలని దేవుడు కోరుకొంటున్నాడు. ఆ సందర్భాల్లో, ఏది ఏమైనా సరే నేను దేవునితోనే ఉంటాను, దేవుడు నన్ను సంపూర్ణంగా తయారు చేస్తున్నప్పుడు ఆయనకు విధేయత చూపిస్తానని చెప్పాలి. ఈ సందర్భంలో చాలామంది విశ్వాసులు ఫెయిల్ అయిపోతున్నారు. విధేయత చూపించడం వెలతో కూడుకొన్న విషయం. దేవుడు అలాంటి వ్యక్తుల కోసం చూస్తున్నాడు. వెల చెల్లించడానికి ఇష్టంగా ఉన్నామా? విధేయత పరిపక్వతను, పరిపూర్ణతను తీసుకొని వస్తుంది. అలాంటి పరిస్థితుల గుండా వెళ్తున్నప్పుడు దేవుని సారూప్యతలోనికి ఎదుగుతాము.

## లోపలి పేజీల్లో...

❄ స్పైకాన్ తర్వాత ఏమి చేయాలి? - 2
❄ శ్రమల్లో విధేయత చూపించాలి, రాజీపడకూడదు - 3
❄ క్రీస్తు మాదిరి అల్పకాలం - అనంత కాలం - 4
❄ పవిత్రీకరించుకో - 5
❄ ఆరాధ్యుని అడుగుల అనుకరణ - 9
❄ ఒకరినొకరు పురికొల్పుకుందాం - 13
❄ హింసల్లో యథార్థతను, పరిశుద్ధతను కాపాడుకొందాం - 17
❄ యుఇయస్ఐ హృదయ స్పందన - వాక్య అధ్యయనమే -20
❄ ఆయన అడుగు జాడల్ని అనుకరిద్దాం - 24
❄ స్పైకాన్ డైరీ... - 27
❄ కృతజ్ఞతకు అసలు కారణం - 30
❄ యెహోవా పరిశుద్ధుడు - 32

# క్రీస్తు మాదిరి అల్ప కాలం అనంత కాలం

"ఒక్క రోజు మాత్రమే భారత ప్రధానిగా ఉండే అవకాశం మీకు వస్తే ఏమి చేస్తారు?" అనే ప్రశ్నకు వివిధ రకాల జవాబులు మా ఫ్రెండ్స్ ఇచ్చారు. వారి ఉద్దేశం ఇది చాలా అరుదైన అవకాశం. చాలాసార్లు కలలు కంటాం. కానీ నిజ జీవితంలో ఊహకందనిది. ఒక ప్రధానిగా ఉండడమనేది ఒక సగటు భారతీయునికి చాలా ప్రత్యేకమైనది, చాలా ప్రధానమైనది, చాలా ప్రశస్తమైనది. అయితే క్రీస్తులా ఉండే అవకాశం ఒకే రోజు మనకు లభిస్తే దానిని ఒక రోజుకే పరిమితం చేస్తామా? ఆ భాగ్యవంతమైన స్థాయిని కలకాలం కొనసాగించడానికి ఇష్టపడతామా? మన ఛాయిస్ ఏంటి?

భారత ప్రధానిగా ఉండే అవకాశం మనకు రాకపోవచ్చు, గానీ భారతావనిలో క్రీస్తులా జీవించడానికి ఆహ్వానం ఎప్పటి నుంచో ఉంది. మొదటిది సాధించడానికి ప్రజల మద్దత్తు, ప్రచారం, ప్రభుత్వం యొక్క అండ, సహకారం, పేరు ప్రతిష్టలు, పాదయాత్రలు...ఇలా ఎన్నో తప్పక అవసరమవుతాయి. కానీ క్రీస్తులా (ప్రభువు ప్రతిబింబం) జీవించేందుకు మిగతా వాటితో సంబంధం లేకుండా ప్రభువుపై అపారమైన ప్రేమ, ఆయన ప్రతిరూపంలా బ్రతకాలనే ప్రగాఢమైన అభిలాష తప్పక ఉండాలి. దీనికి మన విద్య, ఉద్యోగ, ఆస్తిపాస్తులతో సంబంధం లేదని మనకు తెలుసు.

క్రీస్తులా బ్రతకాలని చాలామందికి ఉంటుంది. అయితే, ఆయనలా అనుదిన జీవితంలో వాస్తవాల్ని ఎదుర్కొని, అహాన్ని చంపుకొని (తన్నుతాను ఉపేక్షించుకొని) తండ్రికి ఆయన చూపినట్లుగా 100% విధేయత చూపడానికి మనసు ఒప్పదు. మనసు సిద్ధమే, శరీరం బలహీనమన్నట్లు ఆయనలా జీవించాలని ఉంటుంది. కానీ ఆయనలా అనుదిన జీవితంలో క్లిష్టపరిస్థితుల గుండా వెళ్ళడానికి ఇష్టపడము. కానీ 1 పేతురు 2:21 ప్రకారం-క్రీస్తు కూడా మీ కొరకు బాధపడి, మీరు తన అడుగుజాడలయందు నడుచుకొనునట్లు మీకు మాదిరి యుంచిపోయెను". కనుక మనకంటే ముందు మన ప్రభువు వెళ్ళిన మార్గమే, అంత మాత్రమే గాక మనం తన అడుగుజాడల యందు నడవాలని ప్రభువే ఆశిస్తున్నప్పుడు మనకి వేరే మార్గం లేదు. మన ప్రస్తుత పరిస్థితితో సంబంధం లేకుండా ఆయన కోరిన విధానాన్ని మనసారా ఇష్టపడి మక్కువతో, మహోన్నతునిపై మిక్కుటమైన ప్రేమ కలిగి జీవించాల్సిందే. మిగిలిన ఈ శేష జీవితం బ్రతుకుట క్రీస్తే చావైతే లాభం అనే దృక్పథంతో మనం జీవిస్తే మనం ధన్యులం.

ప్రపంచం 'ప్రభువులా జీవించమనే ప్రసంగాలు' చాలా విన్నది. ప్రభువులా జీవించే జీవితాన్ని చాలా తక్కువ చూసింది. మన స్పైకాన్స్‌ని ప్రేరణగా తీసుకొని, ఈ నూతన సంవత్సర ప్రారంభం నుండే ప్రభువులా బ్రతికేందుకు కంకణం కట్టుకొందాం. ఇలా జీవించేందుకు ప్రతిష్టించుకొని, పవిత్ర జీవితంతో కొనసాగే ప్రక్రియలో ప్రభువుని ప్రతిబింబింపచేసి, ప్రభువుకి, ప్రపంచానికి మాదిరిగా జీవితాన్ని కొనసాగిద్దాం.

ప్రధాని కాకపోవచ్చు, కానీ ప్రభువులా ఒక్క రోజు మాత్రమే కాకుండా మనం జీవించినంత కాలం జీవించి నిత్యత్వాన్ని స్వంతం చేసుకొందాం. ఈ మధుర స్మృతులతో కలకాలం నిత్యత్వంలో మాదిరిగా, మధురంగా, ప్రభువు ప్రతిబింబంలా నిలిచిపోదామా?

ఆయన ప్రణాళికలో మీ....

ఆర్. శ్రీనివాస్
యుఇయస్ఐ-ఏపి స్టేట్ సెక్రటరీ, గుంటూరు



ప్రత్యేకం

# పవిత్రీకరించుకో...

**1 పేతురు 1:13-21**

చర్చ్ సేవ కోసం మీరు ఒక తెల్ల డ్రెస్ గానీ, షర్ట్ గానీ, చుడీదార్ గానీ కొనుక్కున్నట్లుగా ఊహించుకోండి. అది చాలా నీట్‌గా ఇస్త్రీ చేసి ఉంది. నీవు దాన్ని వేసుకొని చర్చ్‌కి వెళ్ళే క్రమంలో బస్‌స్టాండ్‌కి వెళ్ళాల్సి వచ్చింది. బస్టాండ్‌లో కూర్చొనే ప్రదేశం చాలా మురిగ్గా ఉంది. అంత శుభ్రంగా లేదు. మనం ఏమి చేస్తాం? అపరిశుభ్రంగా ఉన్న మురికి ప్రదేశాన్ని వదిలిపెట్టి శుభ్రంగా ఉన్న ప్రదేశంలో కూర్చోడానికి ప్రయత్నిస్తాం. ఎందుకంటే మనం వేసుకున్నటువంటి ఆ దుస్తులు చాలా తెలుపుగా ఉన్నాయి గనుక ఆ దుస్తులు పాడవ్వకుండా కాపాడుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాం.

పరిశుభ్రంగా ఉన్న ఒక మంచి నీటి బాటిల్‌ని తీసుకొని దాన్ని తెరిచి ఒక డ్రైనేజ్ దగ్గర దాన్ని ఉంచండి. ఒక అరగంట తర్వాత ఆ బాటిల్‌లో ఉన్నటువంటి వాటర్‌ని మనం తాగలేము. ఆ బాటిల్‌లో ఉన్నటువంటి నీరు పరిశుభ్రమైనది దానిలో లోపం లేదు కానీ ఆ బాటిల్ ఉన్నటువంటి చుట్టుపక్కల ప్రాంతం చాలా అపరిశుభ్రంగా ఉంది.

మీరు తెలుపు డ్రెస్ ధరిస్తే ఆ డ్రెస్ మురికి కాకుండా చూసుకోవాలి, చూసుకోవడం మీ బాధ్యత. మీ బాటిల్‌లో శుభ్రమైన వాటర్ ఉంటే దాన్ని అపరిశుభ్రంగా చేసుకోకుండా ఉంచుకోవడం మీ బాధ్యత. అయితే పరిశుద్ధమైన జీవితానికి సంబంధించి, చాలా మంది పరిశుద్ధంగా జీవించాలని అనుకుంటారు కానీ అస్సలు జాగ్రత్తగా ఉండరు. మనం పరిశుద్ధంగా జీవించాలంటే మనం చాలా జాగ్రత్తగా ఉండాలి, అలా జీవించడానికి మన జీవితాలను భద్రపరుచుకోవాలి, కాపాడుకోవాలి.

క్రైస్తవ జీవితం అంటే మ్యూజియం కాదు. మీలో చాలా మంది మ్యూజియంకి వెళ్ళి ఉంటారు. మ్యూజియంకి వెళితే గ్లాస్‌తో తయారు చేసిన బాక్స్‌ల లోపల బంగారం లేదా వజ్రం లాంటి వస్తువులు ఉంటాయి. వాటిమీద వీటిని తాకకండి అని రాస్తారు. ఆ వస్తువులు వాటిలోపల భద్రంగా ఉంటాయి. ఆ మ్యూజియంలో తిరుగుతూ వాటిని ఎంజాయ్ చేస్తాము, చూస్తూ ఉంటాము, ఆనందిస్తాము, ఫోటో తీసుకుంటాము, చాలా సంతోషంగా ఉంటాము. కానీ తాకకూడదు. మన జీవితం మ్యూజియం లాంటిది కాదు. మనం లోకంలో జీవించాల్సి ఉంది. మనల్ని లోకం టచ్ చేస్తుంది. మన మీద ప్రపంచం చేయగలిగిందంతా చేస్తుంది. కాబట్టి అక్కడే మన జీవితం కలుషితం కాకుండా చాలా జాగ్రత్తగా ఉండాల్సిన బాధ్యత మనకుంది.

మనం ఇప్పుడు 1 పేతురు 1:13వ వచనం కాబట్టి అనే మాటతో ప్రారంభమైంది. ఎందుకంటే మూడవ వచనం నుంచి పన్నెండవ వచనం వరకు పేతురు మన రక్షణ యొక్క గొప్పతనాన్ని, స్వభావాన్ని వివరించాడు. పాత నిబంధన కాలానికి సంబంధించిన ప్రవక్తలు ఈ రక్షణను చూడాలనుకున్నారు గాని వారు చూడలేక పోయారు. కానీ మనం చూస్తున్నాం. దేవుడు మనల్ని అంత గొప్ప అద్భుతమైన, ఆశీర్వాదకరమైన రక్షణతో ఆశీర్వదించాడు కాబట్టి, రక్షణ యొక్క ప్రతిస్పందన ఏంటంటే పరిశుద్ధంగా జీవించడమే. అయితే, నేను పరిశుద్ధంగా ఎలా జీవించాలి?

## 1. భవిష్యత్తులో యేసు క్రీస్తు ప్రభువు రాకడ వెలుగులో ప్రస్తుతం పరిశుద్ధంగా జీవించాలి.

యేసు క్రీస్తు ప్రభువు భవిష్యత్తు రాకను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం జీవించమని, 'సంపూర్ణ' నిరీక్షణ కలిగి జీవించమని పేతురు మనల్ని హెచ్చరిస్తున్నాడు. ఇది ఎప్పుడు చేయాలంటే ఇప్పుడే చేయాలి. అలాంటి జీవితానికి రెండు లక్షణాలు ఉన్నాయి.

### 1. మీ నడుమును కట్టుకోవాలి (13)

అంటే ఒక మంచి పని కోసం మన మనసును సిద్ధపరచుకోవడం. ఒక ప్రాముఖ్యమైన అతిథి మీ ఇంటికి వస్తున్నప్పుడు, మీ తల్లి ఏమి చేస్తారు? ఇంటిని శుభ్రపరుస్తారు. ప్రతి దాన్ని సక్రమంగా సర్దుకుంటారు. ప్రతీది చాలా శుభ్రంగా, అందంగా కనిపిస్తుంది. ఒకవేళ మీరు దాన్ని గందరగోళం చేయడానికి ప్రయత్నిస్తే, "అలా చేయవద్దు మన ఇంటికి అతిథులు వస్తున్నారు" అని తల్లి చెప్తుంది. రాబోతున్న అతిథులను దృష్టిలో పెట్టుకొని మన ఇంటిని మనం సర్దుకున్నాం, శుభ్రపరుచుకున్నాం. పేతురు కూడా చెప్తుంది అదే, యేసుక్రీస్తు ప్రభువు రాబోతున్నాడు కాబట్టి మీరు మీ మనసును సిద్ధపరుచుకోండి.

నేను గ్రామీణ ప్రాంతంలో పుట్టి పెరిగాను. ఆ రోజుల్లో ప్యాంట్లు లేవు. లుంగీలోనే ఉండేవాళ్ళం. లుంగీలని కింది వరకు ధరించేవాళ్ళం. ఏ పనీ చేయకుండా సరదాగా నడుస్తున్నప్పుడు, క్యాజువల్‌గా ఉన్నప్పుడు లుంగీని కింద దించుతాం. ఎవరైనా "రండి పని చేయండి" అని చెప్పినప్పుడు కాలు వెనక్కి తన్ని లుంగీని కట్టుకొని పని చేస్తాం. నడుము కట్టుకోండి అనే మాటకు బైబిల్ అర్థం అదే. మీ లుంగీలు పైకి కట్టుకొని పనికి సిద్ధపడండి అని అర్థం. మన మనసులను పని కోసం సిద్ధపరుచుకోవడం. కానీ, ఏ పనులు చేయాలి అనేది ప్రశ్న. ఏ పనులంటే దేవుని వాక్యంలో ఆజ్ఞాపించబడిన పనులు. నేను వాటిని ఎలా తెలుసుకోగలను?

మొదటి పేతురు పత్రిక 2:1లో నిర్మలమైన వాక్యమను పాల వలన రక్షణ విషయంలో ఎదుగు నిమిత్తం ఆ పాలను అపేక్షించాలని చూస్తున్నాం. 1:14లో మీరు విధేయులైన పిల్లలై అనే మాటను వాడుతున్నాడు. నేను దేనికి లోబడాలి? దేవుని వాక్యానికి లోబడాలి. దేవుని వాక్యంలో ఉన్న విషయాలకు లోబడాలి. మనం మనసును సిద్ధపరుచుకోవడం అంటే దేవుని వాక్యంలో దేవుడు చేయమని చెప్పినటువంటి ప్రతి విషయాన్ని చేయడానికి మనల్ని మనం సిద్ధపరుచుకోవాలి.

### 2. నిబ్బరమైన బుద్ధి కలవారిగా ఉండాలి(13వ)

దీనికి సంబంధించి నేను ఒక నెగిటివ్ ఉదాహరణ చెప్పాలనుకుంటున్నాను. ఒక వ్యక్తి బాగా తాగి ఉంటే అతనికి బుద్ధి ఉండదు. ఎందుకంటే మందు అతన్ని కంట్రోల్ చేస్తుంది. బుద్ధి ఉంటే, మీరు రోడ్డుకి ఎడమవైపు నడుస్తారు. లేకపోతే రోడ్డు మధ్యలో నడుస్తారు. అర్థమైంది కదా! అదే నిబ్బరమైన బుద్ధి కలవారు అనే మాటకు అర్థం. భవిష్యత్‌లో రాబోతున్నటువంటి యేసు క్రీస్తు యొక్క ప్రత్యక్షతను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం మనం ఎలా జీవించాలంటే నిబ్బరమైన బుద్ధి కలిగి జీవించాలి.

ఇక్కడ మీరు, మేము మద్యం సేవించము కదా అని అనుకుంటారు. అయితే ఈ లోకం మనల్ని మత్తులుగా చేస్తుంది. మన మనసును, మన బుద్ధిని కోల్పోయే విధంగా ఈ లోకం మన మీద పని చేస్తుంది. ఈ ప్రపంచం మనల్ని ఎక్కువగా ప్రభావితం చేస్తూ అలా జీవించాలని బలవంతం చేస్తున్న విషయం ఏంటంటే, 'ప్రస్తుతమే జీవించు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకోకు' అని చెప్తుంది. ఇప్పటి కోసమే జీవించండి, భవిష్యత్ గురించి మీరు దృష్టి పెట్టకండి. భవిష్యత్‌లో ఏమీ లేదు.

చాలా రోజుల క్రితం ఒక న్యూస్ పేపర్ మొదటి పేజీలో ఒక అడ్వర్టైజ్‌మెంట్ చూశాను. అది స్మార్ట్ ఫోన్ కోసం ఉన్నటువంటి అడ్వర్టైజ్‌మెంట్. పేజీలో ఒక భాగమంతా ఫోన్ యొక్క పెద్ద ఫోటో ఉంది. ఆ ఫోన్ కింద 'ఇప్పుడే కొనండి' అనే రెండే రెండు మాటలు ఉన్నాయి. ప్రపంచం చెప్పేది అదే. రేపటి గురించి ఆలోచించొద్దు, ఇప్పటి గురించి ఆలోచించు. మీరు క్రెడిట్ కార్డ్ ఉపయోగిస్తారో, అప్పు చేస్తారో, మీరు దొంగతనం చేసైనా సరే ఇప్పుడే కొనాలి దాన్ని. లోకం మనల్ని ఇలానే ప్రభావితం చేస్తుంది. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతంలో జీవించాలనుకున్న వారందరూ కూడా ఈ లోకం చేస్తున్నటువంటి ఈ యొక్క మత్తులోకి దిగకండి, నిబ్బరమైన బుద్ధి కలిగి ఉండండి అని పేతురు చెబుతున్నాడు.

ఈ లోకం మనకి మన మనసులో చొప్పించే

టటువంటి మత్తులాంటి విషయమేంటంటే, యేసుక్రీస్తు అందరిలో ఒకడు, 'ఆయనే మార్గం కాదు', ఏదో ఒకరోజు అందరూ ఏదో ఒక విధంగా మోక్షానికి వెళ్తారు, నువ్వు రక్షణ పొందావు కదా! అది చాల్లే, పవిత్రంగా జీవించినా జీవించకపోయినా ఎవరు పట్టించుకుంటారు అని చెబుతుంది.

అపోస్తలుడైన పౌలు ఈ విషయంలో మనకు అద్భుతమైన మాదిరి. అపో. కా. 17వ అధ్యాయంలో ప్రపంచంలోని అత్యంత అద్భుతమైన ప్రదేశమైన ఏథెన్స్‌కు పౌలు వెళ్ళాడు. అక్కడ 'అథెన' అనే దేవత యొక్క గొప్ప మందిరం ఉంది. అది ప్రపంచ ప్రసిద్ధి గాంచిన మందిరం. ఆ పట్టణానికి రక్షకుని గురించి తెలియదు. గనుక రక్షకుని గురించి చెప్పడానికి ఆయన వెళ్ళాడు. పౌలు ఆ ఏథెన్స్ పట్టణం అంతా తిరిగాడు, అక్కడున్నటువంటి విగ్రహాలు అన్నిటినీ 'జాగ్రత్తగా' గమనించాడు. సమస్తమును దేవుని వెలుగులో, సువార్త వెలుగులో గమనించాడు. అయితే ఆయన మనసును ప్రభావితం చేసే ఈ లోక సంబంధమైన విషయాలను ఆయన తన మనసులోకి ఏ మాత్రం చొరబడనీయలేదు.

నీ కాలేజీలకు, నీ ఉద్యోగ ప్రాంతానికి, నీ పట్టణానికి దూరంగా పారిపోవడానికి దేవుడు నిన్ను పిలవలేదు, గానీ అక్కడ ఉండి ప్రతి విషయాన్ని పరీక్షించి, పరిశీలించి దేవుని వాక్యపు వెలుగులో, సువార్త వెలుగులో దాన్ని చూడడానికి దేవుడు నిన్ను పిలిచాడు. యోహాను 17:15లో "నీవు లోకము నుండి వారిని తీసుకుపొమ్మని నేను ప్రార్థించుట లేదు గానీ దుష్టుని నుండి వారిని కాపాడమని, సత్యమందు వారిని ప్రతిష్ఠచేయమని ప్రార్థించాడు.

భవిష్యత్ వెలుగులో మనం ప్రస్తుతాన్ని గమనిస్తేనే మనం ఈ పరిశుద్ధ జీవితాన్ని జీవించగలు గుతాం. ఈ ప్రశ్నలను గమనిద్దాం.

దేవుడు నా జీవితం ద్వారా ఎలా మహిమ పొందుతాడు? నా జీవితంలో ఉన్న ప్రతి విషయాన్ని, నా చదువును, నా ఉద్యోగాన్ని, నా పరిచర్య అన్నిటినీ దేవుని వాక్యపు వెలుగులో నేను చేస్తున్నానా? యేసుక్రీస్తు ప్రభువు వచ్చినప్పుడు నా కోరికలు నా జీవితం అంతా వెళ్ళిపోతుంది కేవలం యేసుక్రీస్తు ప్రభువు కోసం నేను చేసినటువంటి జీవితం నిలబడుతుందని అర్థమైందా? నిత్యత్వ ఉద్దేశం కోసం నా డబ్బును, నా కాలాన్ని, నా జీవితాన్ని వినియోగిస్తున్నానా? లేక ఈ లోక సంబంధమైన



విషయాల కోసమే వాటిని వినియోగిస్తున్నానా? నా స్నేహితులతో నా సహ ఉద్యోగులతో నేను కలిసి తిరుగుతున్నప్పుడు వారిని దేవుని వాక్యపు వెలుగులో నిత్యత్వపు వెలుగులో చూస్తున్నానా? లేకుంటే వారిని నాతోటి మనుషుల్లాగానే నేను చూస్తున్నానా? ఈ లోకము నీ చెవిలో గొణుగుతున్న సణుగుతున్న విషయం ఏదైనా ఉందా? నీ మనసును ప్రభావితం చేసి నిన్ను మత్తునిగా చేసిందా? దేవుడు చెప్తున్నాడు ఆ యొక్క మత్తు నుంచి బయటికి రా లోకానికి లోబడవద్దు అని.

## 2. మన పరలోకపు తండ్రిని అనుకరించడం ద్వారానే మనం పరిశుద్ధంగా జీవించగలం.

1పేతురు1:14,15,16 వచనాలు చూద్దాం. నేను పరిశుద్ధుడనైయున్నాను గనుక మీరును పరిశుద్ధులైయుండుడి అని వ్రాయబడియున్నది. కాగా మీరు విధేయులగు పిల్లలై మీ పూర్వపు అజ్ఞాన దశలో మీకుండిన ఆశలను అనుసరించి ప్రవర్తింపక మిమ్మును పిలిచినవాడు పరిశుద్ధుడైయున్న ప్రకారము మీరును సమస్త ప్రవర్తన యందు పరిశుద్ధులైయుండుడి. మనం పరిశుద్ధులుగా ఉండాలి. ఎందుకంటే ఆయన పరిశుద్ధుడు కాబట్టి. పిల్లలు తల్లిదండ్రులను అనుకరిస్తూ ఉంటారు. మనం మన పరలోకపు తండ్రిని అనుకరించడానికి పిలువబడ్డాము.

నేను వైజాగ్ నుంచి ఒంగోలు రావడానికి ట్రైన్‌లో ప్రయాణం చేస్తున్నాను. ఒంగోలు సమీపిస్తున్నప్పుడు అద్దం వైపుకు వెళ్ళాను. అక్కడ రెండు అద్దాలున్నాయి. ఒకటి కుడివైపు, రెండోది ఎడమవైపు. కుడివైపు ఉన్నటువంటి అద్దంలో దువ్వెనతో దువ్వుకోలేకపోయాను. నా ఇమేజ్‌ను సరిగా చూడలేకపోయాను. ఎందుకంటే అది చెడిపోయింది. దానిమీద దుమ్ము పడి ఉంది. అప్పుడు నేను ఎడమవైపు ఉన్న అద్దం వైపు తిరిగాను. అది చాలా స్పష్టంగా, శుభ్రంగా ఉంది. ఆ అద్దం తన సొంత ప్రతిబింబాన్ని ప్రతిబింబించదు. ఆ అద్దంలో

ఉన్నటువంటి మన ప్రతిబింబాన్ని చూపించే ఒక వస్తువది. సూర్యుని నుంచి వచ్చేటటువంటి వెలుగు శుభ్రంగా ఉన్న అద్దం మీద పడినప్పుడు దాని ప్రతిబింబం చాలా బలంగా ఉంటుంది, తీవ్రంగా ఉంటుంది. అయితే అద్దం నిండా దుమ్ము, ధూళి పడి ఉన్నప్పుడు సూర్య కిరణాలు పడినప్పటికీ ఆ అద్దం నుంచి ఎలాంటి ప్రతిబింబం రాదు.

మనం కూడా అద్దం లాంటి వాళ్ళం. దేవుడు ఆ వెలుగు. ఆయన వెలుగు దేవుని పిల్లల మీద పడుతూనే ఉంటుంది. అయితే అద్దం మీద దుమ్ము, ధూళి ఉంటే అది ఎలాంటి వెలుగును ప్రతిబింబించదు. మనం పరిశుభ్రంగా ఉన్నటువంటి అద్దంలాగా ఉంటే యేసుక్రీస్తు ప్రభువు యొక్క సుందరమైనటువంటి ఆ రూపం మన ద్వారా ప్రతిబింబిస్తుంది. యేసుక్రీస్తు ప్రభువు మన దగ్గరికి వచ్చి మన మొహాలు చూసి మిమ్మల్ని ఎప్పుడూ చూడలేదే, మీరు శుభ్రంగా లేరే, నా మొహం మీలో కనపడట్లేదే అంటాడు. ఎందుకంటే అద్దం ఆయన మొహాన్ని సరిగా ప్రతిబింబించటం లేదు. నేను పరిశుద్ధుడిని గనుక మీరు కూడా పరిశుద్ధులైయుండుడి. ఈ అద్దం పరిశుభ్రంగా ఉన్నప్పుడే, అంటే మనం పరిశుద్ధంగా ఉన్నప్పుడే ఆయన బింబం మనలో ప్రతిబింబిస్తుంది.

### 3. పరిశుద్ధంగా, సమర్పణ కలిగిన జీవితం ఎప్పుడు జీవిస్తామంటే దేవుని భయం మనలో ఉన్నప్పుడే

దేవుని భయం అంటే ఏంటి? దేవుడు అనగానే భయకంపితులై, ఆయన్ను గౌరవించడమా? కాదు. అయితే దేవుని భయంలో అవి కొంతవరకు ఉంటాయి. కానీ, దేవుని భయం అంటే పూర్తిగా అదికాదు.

ఒక దేశానికి రాజుగా పట్టాభిషేకం చేయబోతున్నటువంటి ఒక రాజు గురించి ఊహించండి. ఆ పట్టాభిషేకానికి వచ్చినటువంటి అనేకమంది ప్రజలు తమ యొక్క తలలు వంచి రాజుకి నమస్కారం చేస్తారు, భయంతో వణుకుతారు. మొదటి వరుసలో రాజుగారి చిన్న కుమారుడు కూర్చుని ఉన్నాడు. ఆయన కూడా తన తలను వంచి రాజుగారికి గౌరవాన్ని ప్రదర్శించాడు. ప్రజలందరూ తలవంచి రాజుగారికి నమస్కారం చేయటం ఒక ఎత్తు, తన కుమారుడు తలవంచి నమస్కారం చేయటం మరొక ఎత్తు. ప్రతి ఒక్కళ్ళు అలా నమస్కారం చేయకపోతే రాజు వాళ్ళను చంపేస్తాడనే భయంతో వాళ్ళు తమ తలలు వంచారు. అయితే రాజుగారి కుమారుడు ఎందుకు తలవంచాడంటే, ఆ రాజు వాళ్ళ నాన్న, తనను ప్రేమించేవాడు. గనుక ఆ గౌరవ భావంతో తలవంచాడు.

దేవుని భయం అంటే ఏమిటో ఒక చిన్న నిర్వచనం నేను తెలియజేస్తున్నాను. దేవుని భయంలో మూడు విషయాలు ఉన్నాయి. మొదటిది-దేవుని పట్ల లోతైన ప్రేమ, లోతైనటువంటి ఆశ్చర్యం, లోతైన గౌరవాన్ని కలిగి ఉండడం. రెండవది-ప్రతి చోట దేవుని సన్నిధిలో నేను ఉన్నాననే లోతైన అవగాహన కలిగి ఉండడం. మూడవది-ఏది ఏమైనప్పటికీ దేవుని చిత్తానికి మాత్రమే లోబడుతాననే లోతైన నిబద్ధత, నిర్ణయం కలిగి ఉండడం. ఎంత ఖర్చు అయినా పర్వాలేదు, ఏది ఏమి జరిగినా ఫర్వాలేదు. దేవుని చిత్తానికే లోబడుతాననే దృఢ నిర్ణయాన్ని కలిగి ఉండడమే దేవుని భయం.

ఈ విషయానికి ఒక అద్భుతమైన మాదిరి యోసేపు. యెషయా ఆరవ అధ్యాయంలో దేవుని దర్శనాన్ని చూసినప్పుడు యెషయా దేవుని ముందు మోకరిల్లాడు. చాలామంది దేవుని ముందు మోకరించి సాష్టాంగపడినట్లుగా చూస్తాం కానీ, యోసేపు అలా చేసినట్లు బైబిల్లో ఎక్కడా లేదు. అయినప్పటికీ దేవుని భయం కలిగినటువంటి వ్యక్తి. ఆయన ఎక్కడున్నా దేవుని పట్ల లోతైన ప్రేమ, లోతైన గౌరవం, లోతైన భయభక్తులు కలిగి జీవించాడు. పోతీఫరు ఇంట్లో కూడా దేవుని సన్నిధి తనకు తోడుగా ఉందని లోతైన అవగాహన కలిగి ఉన్నాడు. అది కనానులో అయినా సరే, ఐగుప్తులో అయినా సరే దేవుని చిత్తానికి పూర్తిగా లోబడడానికి ఆయన ఇష్టపడ్డాడు.

మీరు దేవుని భయం కలిగి ఉన్నారో లేదో తెలుసుకోవటానికి ఈ మూడు ప్రశ్నలు మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. దేవుని పట్ల లోతైనటువంటి గౌరవం నాకుందా? ప్రతి చోట దేవుని సన్నిధి నాకు తోడుగా ఉన్నదనే లోతైన అవగాహన మీకున్నదా? ఏది ఏమైనా సరే దేవుని చిత్తానికి లోబడుతామనే బలమైన సమర్పణ మీకుందా? మీ సమాధానం అవునైతే మీరు దేవుని భయం కలిగినవారు. వీటిలో ఏదైనా సమస్య ఉంటే మీకు దేవుని భయం లేనట్లే.

(సదరన్ సర్కార్స్ స్పైకాన్‌లోని మొదటి ఎక్స్‌పోజిషన్ నుండి సంగ్రహణ)

**– పాస్టర్. సిమియోన్ సుందర్,** బెంగళూరు



# ఆరాధ్యుని అడుగుల అనుకరణ

“భారతదేశం నిజమైన క్రైస్తవుడిని చూడాలని” చెప్పాడు సాధు సుందర్ సింగ్ గారు. అలాగే, ప్రతి క్రైస్తవుడు కూడా తను ఉన్న పరిస్థితిలో ఒక చిన్న క్రీస్తులాగా ఉండాలి. ఒకవేళ అలా జీవించకుండా నీలో ఉన్న అగ్ని గనుక ఆరిపోతే అనేక మంది అగ్నికి ఆహుతి అవుతారు. కాబట్టి ఆ భారం మన మీదే ఉంది. కోయంబత్తూరులో ఇయును ప్రారంభించింది పొన్నురాజుగారు. ఆయన్ని హాస్టల్లో, కాలేజీలో ‘లిటిల్ క్రైస్ట్’ అనే నిక్‌నేమ్‌తో పిలిచేవారు. యుఇయస్ఐలో ఉన్న మనం కూడా ఒక లిటిల్ క్రైస్ట్‌లాగా జీవించాలి. క్రిస్టియన్ అంటే ఒక లిటిల్ క్రైస్ట్ అని నేటి సమాజానికి మనం చూపించాలి. ఇది ఎప్పుడు సాధ్యం అంటే మనం క్రీస్తును అనుకరించినప్పుడే.

ఇమిటేషన్ అనే పదం లాటిన్‌లో ‘ఇమిటైరి’ అనే పదం నుండి, ‘మిమిటె’ అనే గ్రీకు పదం నుంచి వచ్చింది. వీటి అర్థం ప్రతిలిపి, జిరాక్స్, ప్రతిరూపం, అనుకరణ. ఒక్క మాటలో చెప్పాలంటే ఒక వ్యక్తి చేసిన దానిని, అతని మాదిరిని వెంబడించడం. లోకం మనలో ప్రభువైన యేసుని చూడాలి. అలా చూస్తే దాన్ని అనుకరణ అంటాం. కాబట్టి ఈ రోజు అంశం ఆరాధ్యుని అడుగుల అనుకరణ. దీనికి మూల వచనాలు యోహాను సువార్త 13:15; 2 కొరింథీ 11:1; ఎఫెసీ 5:1.

1 పేతురు 2:21,22 వచనాలను చూస్తే “ఇందుకు మీరు పిలువబడితిరి. క్రీస్తుకూడా మీకొరకు బాధపడి, మీరు తన అడుగుజాడలయందు నడుచుకొనునట్లు మీకు మాదిరి యుంచి పోయెను. ఆయన పాపము చేయలేదు; ఆయన నోటను ఏ కపటమును కనబడలేదు” అనే మాటల్ని చూస్తాం.

అది 1972వ సంవత్సరం. గుంటూరు పట్టణంలోని స్టాల్ గర్ల్స్ హైస్కూలులో ఓ ఇవాంజిలిస్టిక్ క్యాంప్ జరుగుతోంది. అప్పటికే రక్షణ తీర్మానం చేసుకొన్న నన్ను నా మెంటర్ యం.ఏ. ప్రసాదరావు గారు ప్రోత్సహించి ఆ క్యాంప్‌కు తీసుకెళ్ళారు. ఆ క్యాంప్‌లో యుఇయస్ఐ వ్యవస్థాపకులలో ఒకరైన డా.నార్టన్ స్టైరట్ గారు క్రైస్తవ సిద్ధాంతాలను బోధిస్తున్నాడు. ఆయన మధ్యాహ్న భోజన సమయంలో ప్లేటు పట్టుకొని విద్యార్థులతో పాటు క్యూలో నుంచున్నాడు. ఆ తర్వాత స్కిట్ వేస్తూ, విద్యార్థులను పలకరిస్తూ వారితో మమేకమైపోయాడు. ఈ విషయాలు నాకు చాలా ఆశ్చర్యంగా ఉన్నాయి. సంఘ నేపథ్యం నుంచి వచ్చిన నేను గతంలో ఇలాంటి దృశ్యాల్ని ఎన్నడూ చూడలేదు. స్పీకర్‌గా వచ్చిన వారికి ప్రత్యేక అతిథి మర్యాదలు ఇవ్వడమే ఇప్పటి వరకు తెలుసు. ఈ పరిచర్యలో ఏదో ప్రత్యేకత ఉందనిపించి, ఆ మాదిరిని గమనించి ‘సేవ అంటే ఇదేరా’ అనుకొని, విద్యార్థుల మధ్య జరిగే ఈ సేవలో, ఉద్యమంలో నేను కూడా ఒక సాక్షిగా ఉండాలనే నిర్ణయానికి వచ్చాను. అప్పుడు నా వయస్సు 16 సంవత్సరాలు. ఆ తర్వాత యుఇయస్ఐ సేవలో ముఖ్య స్తంభాలైన ప్రొ.ఇనాక్, డా. నంబూద్రిపాద్, చాందపిళ్ళ, పిసి వర్గీస్, ఆర్థర్ హోప్, సత్‌కీర్తిరావు వంటి దైవజనులు

పదేపదే గుంటూరు రావటం వల్ల వారి జీవిత మాదిరి, బోధలకు ప్రభావితుడనై ఈ విద్యార్థి పరిచర్యకు అంకితమవ్వాలని సంపూర్ణ నిశ్చయతతో తీర్మానించుకొన్నాను.

## అనుకరణ అంటే?

1. క్రీస్తును అభిమానించడం కాదు – క్రీస్తు గుణములను ప్రతిబింబించడం.
2. క్రీస్తును పోలి నటించడం కాదు – క్రీస్తు దగ్గర నేర్చుకొని వెంబడించడం.
3. యాంత్రికంగా పనిచేయడం కాదు – ఆధ్యాత్మికతను పెంచే క్రియలలో ఇమిడిపోవడం.
4. చొరవ చూపని విశ్వాసం కాదు – పాలుపంచుకొనే చురుకైన విశ్వాస జీవన శైలి.
5. ఆమోదించబడిన అధికార హోదా కాదు – నమ్మకమైన సేవాతత్వం.
6. పరిపూర్ణత పొందడం కాదు – కృపలో పురోగమించడం.
7. వాక్య వేదికలకు పరిమితం కాదు – ఇల్లయినా వీధియైనా ప్రతి స్థలానికి చెందినది.
8. ఆప్షనల్ లేక ఐచ్ఛికం కాదు – తప్పనిసరైన ఆధ్యాత్మిక శిక్షణ.
9. క్రైస్తవ పద్ధతులను అనుకరించడం కాదు – ఇది దేవుని పిలుపు, ఆయన పిలుపుకు తగినట్లుగా జీవించడం.

## ఉద్దేశం

1. దేవుని హృదయాన్ని ప్రతిబింబించడం – యోహాను 14:9.
2. క్రీస్తు స్వరూపానికి ప్రతిరూపం చూపించడం – రోమా 8:29.
3. సేవా పాత్రను పోషించడానికి – యోహాను 13:14.
4. క్రీస్తు ప్రేమను మన తరానికి చూపించుటకు – యోహాను 15:12.
5. సాతాను క్రియలు లయపరచుటకు – 1 యోహాను 3:8.

## జీవిత మాదిరి పౌలు

“ప్రతి క్రైస్తవుని ఉన్నతమైన గమ్యం క్రీస్తును పోలి జీవించడమే”. అని అంటాడు హడ్సన్ టేలర్. ఆ గమ్యాన్ని పౌలు ఎలా చేరుకున్నాడో చూద్దాం. ప్రతి దానికి రెండు రెఫరెన్స్‌లున్నాయి ఒకటి ప్రభువుకు సంబంధించినది అయితే, రెండవది ఆయనను పోలి జీవించిన పౌలుది.

**1. రక్షకుని వలె పాటించిన విధేయత** – యోహాను 4:34 ▶ అపొ.కా. 26:19

యేసు ప్రభువు వారు  ఫిలిప్పీ 2:8 ప్రకారం మానవునిగా తగ్గించుకొని, సిలువ మరణము పొందినంతగా విధేయత చూపించాడు. ఆయన విధేయతకే అర్థం చెప్పిన వినయ మనస్కుడు. ఈ లోకంలో ఎవరిని తీసుకున్నా, ఈరోజు ‘యువర్స్ ఒబీడియంట్లీ’ అని లీవ్ లెటర్ రాస్తాము, గ్రాంట్ చేయకపోతే ఆ లీవ్ లెటర్ వారి మొహాన కొట్టేసి వెళ్ళిపోతాం. అది మన విధేయత. నీ జీవితం సంతోషదాయకంగా, సుఖవంతంగా ఉండాలంటే, నీ జీవితం మంచిగా ఎదగాలంటే దేవున్ని నమ్ము, ఆయనకు విధేయత చూపించు. నువ్వు ఎంతగా లోబడితే అంతగా దేవుడు దీవిస్తాడు, అంతగా దేవుడు నిన్ను మెచ్చుకుంటాడు. కొంతమంది సెయింట్ అగస్టీన్ దగ్గరికి వెళ్ళి, ‘అయ్యా మీ జీవిత రహస్యం ఏంటి?’ అని అడిగారంట. అందుకాయన నెంబర్ వన్ ఒబీడియన్స్, నెంబర్ టు ఒబీడియన్స్, నెంబర్ త్రీ ఒబీడియన్స్, ఇక వేరే మార్గం లేదు’ అని చెప్పాడట. ఆయన కాడి మీద చెయ్యి వేసి వెనక్కి తిరిగి చూచువాడు ఆయన శిష్యుడు కానేరడు. కాబట్టి మన జీవితంలో దేవుడు కోరుకునేది మొట్టమొదటిగా, దేవుని అనుకరించాల్సింది విధేయతే. అపొస్తలుడైన



పౌలు "కాబట్టి అగ్రిప్ప రాజా, ఆకాశమునుండి కలిగిన ఆ దర్శనమునకు నేను అవిధేయుడను కాక" అని చెబుతాడు. తన జీవితమంతా ప్రభువుకు సంపూర్ణ విధేయతను చూపించాడు.

**2. రక్షకుని వలె చేసిన ప్రార్థనావిధానం** – మార్కు 1:35; లూకా 5:16 ▸ ఎఫెసీ 1:6; ఫిలిప్పీ 1:4; అపొ.కా. 16:25

మార్కు 1:35లో మనం చూస్తే, యేసు ప్రభువు ఏమి చేశారు? పెందలకడనే లేచి అరణ్యానికి వెళ్ళి అక్కడ ప్రార్థన చేశాడు. మనం సోమరిగా ఉండి కాళ్ళు ముడుచుకొని దేవా! నాకు సహాయం చెయ్యి అంటే దేవుడు సహాయం చేయడు. ఈ రోజుల్లో మనకు కావాల్సినవి ఆశీర్వాదాలే, కాబట్టి లార్డ్ బ్లెస్ మీ, మై వైఫ్, మై సన్, మై డాటర్ వి ఫోర్ అండ్ నో మోర్ ఆమెన్. అది ప్రార్థనా? ప్రభువు నేర్పిన ప్రార్థన ఇది కానే కాదు. కాబట్టి ప్రభువు చెప్పిన ప్రార్థన మనం నేర్చుకుందాం. ప్రార్థన అంటే దేవునిమీద ఆధారపడేది. నువ్వు ఎంత ఎక్కువగా ప్రార్థిస్తావో అంతగా క్రీస్తులా మారతావని జార్జ్ ముల్లర్ గారు అన్నారు. కాబట్టి ప్రార్థన చేద్దామా? ఎన్ని నిమిషాలు? మనం ప్రేయర్ చేస్తే సాతానుడు వణుకుతాడు. సాతానుని వణికిద్దామా? మనం వణికిపోదామా? సాతానుని వణికించాలి అంటే మోకాళ్ళు వేయాలి. అది రక్షకుని యొక్క ప్రార్థన.

కొత్త నిబంధనలో అపొస్తలుడైన పౌలు చేసిన ప్రార్థనలు (ముఖ్యంగా ఎఫెసీ, ఫిలిప్పీ, కొలొస్సయులకు రాసిన పత్రికలలోనివి) చాలా లోతైన ఆధ్యాత్మిక సత్యాలను కలిగి ఉంటాయి. పౌలు కేవలం భౌతిక అవసరాల కోసం కాకుండా, విశ్వాసుల ఆధ్యాత్మిక ఎదుగుదల కోసం ఎక్కువగా ప్రార్థించారు. ఇలాగే కష్ట కాలంలో విశ్వాసులు ఆనందముతో కూడిన ఓర్పు కలిగి ఉండాలని ప్రార్థించాడు.

**3. రక్షకుని వలె చూపిన సాత్వీకము, దీనత్వము** – మత్తయి 11:29 ▸ 2 కొరింథీ 10:1

నేను సాత్వికుడిని, దీనమనస్సు గలవాడిని. యేసు ప్రభువు వారు తన గురించి తాను చెప్పుకున్న సాక్ష్యం ఇది. మరి మనం? సాత్వికులమేనా? పౌరుషాలు, కోపాలు వస్తాయి, అన్ని గిరాట వేస్తాం. సాత్వికం అనేది కనుమరుగై పోతుంది. నేను స్టూడెంట్‌గా ఉన్నప్పుడు "మీక్‌నెస్ ఈజ్ నాట్ వీక్నెస్ బట్ ఎమోషన్స్ అండర్ కంట్రోల్" అని మన మాజీ స్టేట్ సెక్రటరీ అగస్టీన్ అన్న చెప్పేవాడు. సాత్వికానికి వ్యతిరేకం గర్వం. అందుకని మార్టిన్ లూథర్ గారు ఏమన్నారంటే, "గర్వము దేవదూతలను దయ్యాలుగా మార్చింది, దీనత్వం మనుషులను దేవదూతలుగా మారుస్తుంది". నీలో దీనత్వం ఉంటే నువ్వు దేవదూతలాగా ఉంటావు. నీలో గర్వం ఉంటే నీవు దయ్యంలా అవుతావు. కాబట్టి నువ్వు డెవిల్‌గా ఉండాలనుకుంటున్నావా? లేక ఏంజెల్‌గా ఉండాలనుకుంటున్నావా? అది నీ చేతిలో ఉంది. సాత్వికులు ధన్యులు వారు భూలోకాన్ని స్వతంత్రించుకొంటారు. కత్తి, డాలు, కర్ర పట్టుకొని ఉమ్ అన్న వాళ్ళు స్వాధీనపరుచుకున్నారా లేక యేసుప్రభువు లాంటి సాత్వికులు ప్రపంచాన్ని స్వాధీనపరుచుకున్నారా? చరిత్ర చూస్తే మనకి అర్థమవుతుంది. పౌలు కూడా అటువంటి దీనత్వాన్ని కలిగి ఉన్నాడు. (2 కొరింథీ 10:1).

**4. రక్షకుని వలె చూపిన త్యాగపూరిత ప్రేమ** – యోహాను 13:1 ▸ 2 కొరింథీ 12:15

క్రీస్తు ప్రేమ అగాపే ప్రేమ. ఆ ప్రేమలో త్యాగం ఉంటుంది. గనుక మన జీవితంలో అలాంటి ప్రేమతో పాటు త్యాగం ఉండాలి. "నిన్ను బాధించే అంతగా ప్రేమించే స్థాయికి వెళితే ఇక నిన్ను బాధించేది ఏమీ ఉండదు కాబట్టి, ఇక నీలో ఉండేది అంతా ప్రేమే. కాబట్టి ఆ ప్రేమతోనే నువ్వు దేవునిలో చక్కగా ఎదుగుతావు" అని మదర్ థెరిస్సా గారు చెప్పారు. అనాథల పట్ల ఆ కల్వరి ప్రేమను చూపించి నోబెల్ ప్రైజ్‌ని తీసుకొంది. 1 థెస్సలోనిక పత్రికలో పౌలు గారు అటువంటి ప్రేమను అక్కడి విశ్వాసుల పట్ల కనుబరిచాడు. కాబట్టి మన జీవితంలో ఆ కల్వరి ప్రేమ లేక త్యాగపూరితమైన ప్రేమ ఉన్నప్పుడు పౌలు వలె మనం ముందుకి వెళ్ళగలము.

**5. రక్షకుని వలె బలహీనుల పట్ల, దారి తప్పినవారి పట్ల కనికరం** – మార్కు 8:2 ▸ 2 కొరింథీ 11:29

మార్కు 8:2లో ప్రభువు ఆ ప్రజలను చూసి, అరే మూడు దినముల వరకు వీళ్ళు నాతో ఉన్నారు అని వాళ్ళ మీద కనికరపడి వారికి ఆహారం పెట్టండి అని శిష్యులకు ఆజ్ఞాపించాడు. 2 కొరింథీ 11:29లో పౌలు గారు "వాళ్ళు బలహీనులు కారా? నేను బలహీనుడిని" అని చెప్పాడు. ఆయన మాటల్లో



కనికరం కనబడుతుంది. కనికరం లేని సేవ మెకానికల్ అవుతుంది. ప్రజల పట్ల, పేదవారి పట్ల, నిరుత్సాహంలో ఉన్నవారిపట్ల, దారి తప్పిన వారి పట్ల, నూతన విశ్వాసుల పట్ల కనికరం ఉండాలి. వారిని ప్రోత్సహించాలి. కనికరం ఉన్నప్పుడు దేవుని పోలి మనం జీవించగలము. అలాంటి సేవ దేవుని పోలిన సేవ.

**6. రక్షకుని వలె హింసలలో ధైర్యం** – యోహాను 16:33 ▶ 2 కొరింథీ 4:8,9

పౌలు ప్రభువును అంగీకరించినప్పటి నుండి, సువార్త కొరకు అనేక పర్యాయాలు శ్రమల్ని, కష్టాల్ని, హింసల్ని, అవమానాల్ని అనుభవించాడు. చివరికి ప్రభువు కోసం ప్రాణత్యాగం చేశాడు. నేటి దినాల్లో సువార్త ప్రకటించే వారిని ఈ హాస్టల్లో, కాలేజిలో ఉండడానికి వీల్లేదు, ఈ డిస్ట్రిక్ట్‌కి, ఈ ప్రాంతంలోకి, ఈ గ్రామంలోకి క్రిస్టియన్ అనేవాడు రావడానికి వీల్లేదని చాలామంది ప్రతిజ్ఞ చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పౌలులా దేవుని కోసం ప్రాణం పోయినా సరే సువార్త నేను ప్రకటిస్తాను, ఆయన అడుగుల్లో నేను నడుస్తాను. యేసు ప్రభువే నా మాదిరి, యేసే నా జీవిత ధ్యేయం. ఆయన సిలువ మరణం పొందినంతగా విధేయత చూపించి ముందుకు వెళ్ళాడు కాబట్టి, ఆ అడుగుల్లో నేను అడుగు వేసి చావైనా, రేవైనా ఆయన కోసమే జీవిస్తాను. అది మన జీవిత లక్ష్యమై ఉండాలి.

నా జీవితంలో ఇలాంటి పరిస్థితుల్ని ఎదుర్కొన్నాను. నువ్వు తెనాలిలో పరిచర్య చేస్తూ, మా పిల్లలకు దేవుని చిత్తం అని చెబుతూ వారినందరినీ పాడుచేస్తున్నావ్. 'నీ కాళ్ళు విరగ్గొట్టి మీ గుంటూరుకి నిన్ను పంపించేస్తాం' అనే తీవ్రమైన వార్నింగ్ ఇచ్చారు. వాళ్ళు అంతకు ముందు చాలా మంది కాళ్ళు విరగ్గొట్టిన వాళ్ళు, ప్రాణాలు తీసినవాళ్ళు. మా ఇంటి పక్కన వాళ్ళంతా అన్నా, మీరు నెల రోజులు తెనాలిలో కనబడకుండా పారిపోండి అని చెప్పారు. ఈ విషయం దేవరాజు అన్నకి చెప్పి సలహా అడిగితే 'ఏయ్ ప్రభుదాస్ ఎక్కడికీ పరిగెత్తొద్దు? నేను మీ ఇంటికి వస్తున్నా, ఈ వారం రోజులు చాప వేసుకుని మనం ప్రార్థన చేద్దాం, వాళ్ళు ఏం చేస్తారో మనం చూద్దాం అని చెప్పి నన్ను బలపరచాడు. నేను కాలేజి నుండి ఇంటికి రావడం, ఇద్దరు కలిసి ప్రార్థించడం. ఇలా వారం రోజులు చేశాము. అద్భుతంగా వాళ్ళు ఎవ్వరూ రాలేదు. దేవుని కోసం అలా నిలబడినప్పుడు మన మాజీ స్టాఫ్ సియస్ దత్తు గారు నాకు చెప్పిన మాట ఏంటంటే, "ఒక సత్యం కోసం చనిపోవడం గొప్ప ఆధిక్యత. అంతేగాని పారిపోవడం కాదు".

మనకు కష్టాలు, శ్రమలు వస్తాయి, మనల్ని తూలనాడుతాయి. అయితే, వాటికి మనం సిద్ధంగా ఉన్నామా? అదే పేతురు గారు చెప్పిన మాట (1 పేతురు 3:21,22).

**7. రక్షకుని వలె సేవకుని పోలిన నాయకత్వం** – మార్కు 10:45 ▶ 1 థెస్స 2:7-12

యోహాను 13వ అధ్యాయంలో అందరూ భోజనానికి కూర్చున్నారు. యూదుల ఆచారం ఏంటంటే ఇంట్లోకి వచ్చేటప్పుడు కాళ్ళు కడుక్కుని రావాలి. శిష్యులు కాళ్ళు కడుక్కోకుండా వచ్చారు, ఎవ్వరూ పట్టించుకోవట్లేదు. అప్పుడు వాళ్ళ నాయకుడైన యేసుక్రీస్తు నిలబడి పై వస్త్రాన్ని పక్కన పెట్టి తువాల్ని నడుముకు కట్టుకున్నాడు. తర్వాత ప్లేటు, నీళ్ళు తీసుకుని శిష్యుల యొక్క పాదాలు కడగడం ప్రారంభించాడు. దీన్ని తువాలు సేవ అని అంటారు. క్రిస్టియానిటీ అనగానే క్రాస్ గుర్తుకు వస్తుంది. సర్వీస్ అంటే టవల్ మినిస్ట్రీ గుర్తుకు రావాలి. కాబట్టి పరిచర్యలో మనం అలాంటి అడుగులు వేయాలి.

(సదరన్ సర్కార్స్ స్ప్రైకాన్‌లోని రెండవ డివోషన్ సంగ్రహణ)

– **ఆర్ ప్రభుదాస్,** తెనాలి



ప్రత్యేకం

# ఒకరినొకరు పురికొల్పుకుందాం

పేతురు రాసిన మొదటి పత్రిక మొదటి అధ్యాయంలో రక్షణ గురించి, రెండవ అధ్యాయంలో ఒక విశ్వాసి ఏ విధంగా పరిశుద్ధపరచబడతాడో చూశాము. మూడవ అధ్యాయంలో ఏ విధంగా ఆ విశ్వాసి తనను తాను అప్పగించుకోవాలనేది చూశాము. నాల్గవ అధ్యాయంలో ఒక విశ్వాసి ఏ విధంగా శ్రమలు పొందుతాడో చూస్తున్నాము. ఐదవ దాంట్లో కాపరత్వం ప్రాముఖ్యత గురించి ఉంటుంది. దీని గురించి ఆలోచిస్తూ చివరి అంశమైన పురికొల్పు గురించి నేర్చుకొందాం.

గతంలో ఒకసారి విశాఖపట్నం స్పైకాన్‌లో నేను మాట్లాడుతూ ఉన్నాను. చివరి రోజు నా స్నేహితుడు పూణే నుండి ఫోన్ చేసి వైజాగ్ నుండి ఒంగోలుకు రావాలని చెప్పాడు. ఒంగోల్లో దిగి అక్కడి నుంచి మూడు కిలోమీటర్ల దూరం లోపలికి వెళ్ళాలి, ఒక్క వ్యక్తిని చూడడానికి. ఇక్కడ దాదాపు వెయ్యిమంది ముందు నేను మాట్లాడితే అక్కడ ఒక వృద్ధ స్త్రీని కలవడానికి వెళ్ళాను. నాలుగు దినాలు నేను నిలబడి చెప్పడం వల్ల నా రెండు కాళ్ళు వాచిపోయాయి. వాచిపోయిన కాళ్ళతో కూడా వైజాగ్ నుంచి నేను రిజర్వేషన్ టికెట్ లేకుండా ఒంగోలుకి వెళ్ళి ఆమెను కలిసి దాదాపుగా మూడు గంటలు మాట్లాడి, ఆత్మీయంగా బలపరిచి మరలా తిరిగి హైదరాబాద్‌కి నా బైబిల్ కాలేజీకి వెళ్ళాను. సహవాసంలో ఒక వ్యక్తి ప్రాముఖ్యత అంత గొప్పది.

మరొక ప్రాంతానికి వెళినప్పుడు ఒక విశ్వాసి కాల్ చేసి నేను ఆత్మహత్య చేసుకోవాలనుకొంటున్నాను, చివరిసారిగా మిమ్మల్ని చూడాలనుకుంటున్నాను అంటూ నా దగ్గరికి వచ్చి నాలుగు పేజీలు ఉన్నటువంటి లెటర్ ఇచ్చింది. దాని సారాంశం. "నేను నా భర్తతో లైంగిక సుఖం పొందడం లేదు" అని. ఆమెకు ముగ్గురు పిల్లలు. ఆమె, భర్త చాలా కాలం నుండి పరిచర్యలో ఉంటున్నారు. చాలాసేపు కౌన్సిలింగ్ తర్వాత ఆమె నిరుత్సాహంగా వెళ్ళిపోయింది. సహవాసంలో ఈ విషయం గురించి ఎంతో ప్రార్థించాము. చివరికి ఆమె ఒక డ్రైవర్‌తో వెళ్ళిపోయింది. భర్త చర్చ్‌లో ఒక ప్రాముఖ్యమైన పదవిలో ఉండి తన సొంత భార్యను శ్రద్ధగా చూచుకోలేకపోయాడు. తర్వాత భర్త చనిపోయాడు. ముగ్గురు పిల్లల బాధ్యత సహవాసం తీసుకొంది. సహవాసమే చొరవ తీసుకొని ఒక అమ్మాయికి ఇటీవలే వివాహం చేసింది.

నేను ఎదుర్కొన్న అనేకమైన ఉదాహరణలు ఉన్నాయి. మొన్న న్యూ ఇయర్‌కి ముందే..ఇరవై ఐదు సంవత్సరాల యవ్వనస్థుడు, క్యారల్స్‌లో ఎంతో ఉత్సాహంగా పాట పాడిన వ్యక్తి, లవ్ ఫెయిల్యూర్‌తో ట్రైన్ కింద పడి చనిపోయాడు. ఆ కుటుంబాన్ని ఓదార్చడం చాలా కష్టమైన, బాధాకరమైన విషయం.

మనం క్యాంప్స్‌కు వచ్చే వ్యక్తుల పై భాగం మాత్రమే చూస్తాం, కానీ లోతుగా చూస్తే ఆ వ్యక్తి ఎవరు? దేని గుండా వెళుతున్నాడో అర్థమవుతుంది. తను ఏ స్థితిలో ఉన్నాడో ఆ వ్యక్తికి మాత్రమే

తెలుసు. ఆ వ్యక్తి కొరకు సమయం తీసుకుని ఆ వ్యక్తితో మాట్లాడకపోతే ఆ వ్యక్తి గురించి మనకు తెలియదు. మన సుఖవలయం దాటి వెళ్ళినప్పుడు మాత్రమే ఇవి అర్థమవుతాయి. తప్పించుకోవద్దు, ఒక బాధ్యతగా తీసుకుని అలాంటి వాళ్ళని దర్శించండి, ఆదరించండి. దేవుడు నిన్ను వాడుకోబోతున్నాడు.

ఒక వృద్ధాశ్రమానికి వెళ్ళాను. సొంత కొడుకే వాళ్ళ అమ్మని ఓల్డ్ ఏజ్ హోమ్‌లో పెట్టాడు. ఫోన్ చేస్తే ఫోన్ ఎత్తట్లేదు. 'అయ్యగారు నా కుమారుడికి ఫోన్ చేస్తారా? అని అమె దీనంగా నన్ను అడుగుతుంది. తర్వాత రూమ్‌లోకి వెళ్తే ఒక స్త్రీకి తన ఒంటినిండా గాయాలు ఉన్నాయి. అవి తన సొంత కుమారుడు కొట్టిన దెబ్బలు. వ్యక్తులు ఎలాంటి బాధల గుండా వెళుతున్నారో మనకు అంత సరిగ్గా తెలియకపోవచ్చు. సమయం తీసుకుని ఉద్దేశపూర్వకంగా వారి దగ్గరికి వెళ్ళాలి, ప్రార్థించాలి, ప్రోత్సహించాలి. వెళ్ళకపోతే, వారిని మనం కోల్పోతాము.

1 పేతురు ఐదవ అధ్యాయంలో కాపరత్వం గురించి, మంద గురించి మాట్లాడుతున్నాడు. ప్రధాన కాపరి గురించి మాట్లాడుతున్నాడు. ఇశ్రాయేలీయులలో కాపరులు ఎలా ఉంటారంటే, అందరికంటే ముందుగా ప్రధాన కాపరి ఉంటాడు. తర్వాత గొర్రెలు ఉంటాయి. చివర్లో కొంత మంది కాపరులు ఉంటారు. వారిని ఉపకాపరులు అని అంటాము. నేటి సంఘంలో, క్రైస్తవుల్లో జరుగుచున్న, జరగబోయే ప్రమాదం ఎంటంటే? ఆ ఉపకాపరులు ప్రధాన కాపరి స్థానం తీసుకొని, ప్రధాన కాపరైన క్రీస్తును ఉపకాపరిగా చేస్తున్నారు. అది ఎంతో భయంకరమైన విషయం.

మనం ఫ్లెక్సీ కల్చర్‌లో ఉంటున్నాం. ప్రతీది కనిపించాలి. అందుకనే హైప్‌తో కూడిన పరిచర్యను కొనసాగిస్తున్నాం. ఉపకాపరి ప్రధాన కాపరిగా హెచ్చించుకొంటున్నాడు. గుడ్డి గొర్రెలు ప్రధాన కాపరి ని వదిలి ఉపకాపరిని అనుసరిస్తున్నాయి.

క్యాన్సర్‌తో చనిపోతున్న పేషెంట్ దగ్గరికి నేను వెళ్ళాను. ఆ పేషెంట్ భర్త నాతో 'అన్నా నేను ఆ ఫలానా సంఘానికి వెళ్తాను, ఆ కాపరి ఇచ్చే నూనెని ఆహారంలో కలుపుకొని తింటాము. నా భార్య చనిపోతున్నప్పుడు ఆ కాపరి వచ్చి నువ్వు బాగవుతావు, వచ్చే వారం చర్చికి వస్తావు అని చెప్పేసి వెళ్ళిపోయాడు. మరొక పాస్టర్ వచ్చి నీవు దేవుడి పిలుపును తృణీకరించావు కాబట్టి నీ భార్యకు ఈ క్యాన్సర్ వచ్చింది అన్నాడు. చివరిగా నా భార్య మరణించినప్పుడు ఏ పాస్టర్ రాలేదు. భూస్థాపనలో ఎంతో స్ట్రగుల్ అయ్యాము' అని చెప్పాడు. ఈ రోజుల్లో కాపరులతో వచ్చే సమస్య ఇది.

నాకు చాలా బిరుదులు, చదువు ఏది ఉన్నా, నేను ఎప్పుడూ కూడా ఉపకాపరిగానే ఉంటున్నాను. ఉపకాపరిగా నా యొక్క ప్రధానమైన విషయం ఏంటంటే, ఈ గొర్రెలన్నీ ప్రధాన కాపరిని వెంబడిస్తున్నాయా లేదా అని చూడడం మాత్రమే. నూతన నిబంధనలో కనిపిస్తున్న 'ఒకనికొకరు' అనే పదము వంద సార్లు వాడబడింది. దేవుని ఆత్మ చేత మనమందరం ఒకరికొకరు అనుసంధానమైనటువంటి సమాజంగా ఉంటున్నాము. యేసు ప్రభువు వారి రక్తం, ఒక్క ఆత్మ, ఒక్క బాప్తీస్మము ద్వారా మనం కలపబడ్డాము. ప్రజలుగా ఒకరికొకరం అందరం కూడా మనం కనెక్ట్ అయిఉన్నాం. ఒకరికొకరు మనం జవాబుదారులుగా ఉంటున్నాము.

ఈ మధ్యకాలంలో మనమంతా స్వతంత్రమైన పరిచర్య దినాలలో ఉంటున్నాము. ఇండిపెండెంట్ సంఘాలు ఉన్నట్లే ఇండిపెండెంట్ విశ్వాసులు కూడా ఉంటున్నారు. మనము ఇండిపెండెంట్‌గా ఉండడానికి వీలు లేదు, ఒకరికొకరు ఆధారపడి ఉన్నాము. ఇండిపెండెంట్ సేవకుడు అనే దానికి ఒక అర్థాన్ని చెప్తాను, 'డబ్బుల కోసం అందరిమీద ఆధారపడి ఎవ్వరికీ జవాబుదారీగా ఉండకపోవడం'. సంఘంలో ఇది ప్రమాదకరమైన పరిస్థితి. నేను ఎంతమందికి వీలైతే అంతమందికి జవాబుదారీగా ఉండాలి. అది నన్ను ఆరోగ్యకరంగా ఉంచుతుంది. నేను విశ్వాసిని కాబట్టి నేను క్రీస్తు సహవాసానికి చెందిన వాడిని. కాబట్టి నా ప్రవర్తనలో కూడా యేసుక్రీస్తుని అనుకరించే వాడిగా ఉండాలి. నేను ఆ విధంగా అనుకరిస్తున్నాను కాబట్టి, యేసుక్రీస్తు వలె నేను మార్పు చెందుతున్నాను. మనం ఒకరికొకరం అందరం కూడా కనెక్ట్ అయి ఉన్న వ్యక్తులు గా ఉన్నాము. క్రీస్తు రక్తం ద్వారా, దేవుని వాక్యం ద్వారా, దేవుని ఆత్మ ద్వారా దేవుడు మనందరినీ ఒక సహవాసంగా కదుతున్నాడు. మన సహవాసం ఎదుగుతున్న కొలది దేవుడు దాదాపుగా వంద సార్లు ఒకరికొకరు అనే పదాన్ని మనకందరి కీ చెప్తున్నాడు.

## ఒకరినొకరం ప్రోత్సహించుకోవడం

### 1. ఒకరికొకరు దాసులై ఉండాలి (గలతీ 5:13)

ఎవరైనా సమాధి పెట్టె మోసారా? బరువు అంతా ముందోడికి, వెనకోడికి పడుద్ది. మధ్యలో వాళ్ళు చేయి వేస్తారంతే. పరిచర్యలో కూడా కొంతమందే బరువు మోస్తున్నారు. మిగిలినవారంతా చేయివేసేవాళ్ళే. నీవు ఎంత బరువు మోస్తున్నావు? ఏమి బరువు మోస్తున్నావ్?

నీ ఇయులో ఏమి జరుగుతుంది? బరువు మోసేవాడే బరువు మోయాలి. తక్కిన వాళ్ళంతా చేయివేసే బ్యాచ్. స్పైకాన్, ట్రైకాన్‌లకి తిరుణాళ్ళలా వస్తారు. మళ్ళీ కనపడరు. స్థానిక ఫెలోషిప్ గురించి, బైబిల్ స్టడీ గురించి ఏంటి? ప్రేయర్‌కి నలు గురు, ఐదుగురు వస్తారు. ఏడు గంటలకు అంటే ఎనిమిది గంటలకు ఒకరు, తొమ్మిది గంటలకు మరొకరు వస్తారు. అవునా కాదా చెప్పండి. అవతలి వ్యక్తి యొక్క భారమును మనం భరించాలి, లోబడాలి, దాసులై ఉండాలి. ఏ వ్యక్తుల నిమిత్తమైతే నీవు ప్రార్థన చేస్తున్నావో, ఆ వ్యక్తుల నిమిత్తం నువ్వు వెల చెల్లించాలి. ఒకవేళ అది డబ్బు ఇవ్వడం కావచ్చు, ఆ వ్యక్తిని నువ్వు దర్శించడం కావచ్చు. వారిని బాధ్యతగా చూడాలి. నువ్వు సమయం, రిస్క్ తీసుకుని అక్కడికి వెళ్లి వారికి సమయాన్ని ఇవ్వాలి.

ప్రేరేపించడం అనేది ఒక వ్యక్తి కొరకు నువ్వు సమయం తీసుకుని ఆ వ్యక్తితో ఉండటం, వారి బాధలు భరించడం. నేను కొన్ని సార్లు హాస్పటల్‌కి వెళ్ళి అక్కడి రోగుల్ని దర్శిస్తుంటాను. ఒక్క పేషెంట్ కోసం పదహారు సార్లు నేను నా సొంతగా వంట చేసుకొని వెళ్ళి వాళ్ళని దర్శించాను. ఉద్దేశపూర్వకంగా మన సమయం తీసుకోవాలి. ఆ వ్యక్తి యొక్క బరువును భరించడానికి సిద్ధంగా ఉండాలి. అది అంత సులభమైన విషయం కాదు. నీ యొక్క సౌకర్యమైన దాని నుంచి దాటి ముందుకు వెళ్ళాల్సి వస్తుంది. కానీ దేవుడు నీకు సహాయం చేస్తాడు.

### 2. ఒకరికొకరు లోబడి ఉండాలి (ఎఫెసీ 5:21)

ఒకసారి ఒక కాన్ఫరెన్స్‌లో ఉండగా, ఒక సంఘం వాళ్ళు మధ్యాహ్నం వాళ్ళ సంఘంలో ప్రసంగించమని అడిగారు. అప్పుడు నేను ఆ కాన్ఫరెన్స్ ఆర్గనైజర్స్‌తో, మీరు అనుమతిస్తే నేను వెళ్తానని కమిటీ వారిని అడిగాను. వాళ్ళు వద్దని చెప్పారు. నేను వారికి లోబడి



వెళ్ళలేదు. నేను జవాబుదారీ ఉన్నటువంటి వ్యవస్థలో ఉంటున్నాను. స్వతంత్రంగా ఉండాల్సిన వ్యక్తిగా ఉండకూడదు. కంపెనీల్లో పనిచేసేవారు, ప్రతి విషయంలో చాలా జవాబుదారీగా ఉంటారు. ఈ లోక పరమైన వ్యక్తులే అంత జవాబుదారీగా ఉంటే, దేవుని బిడ్డలుగా నీవు, నేను ఆయన పరిచర్యలో ఇంకెంత జవాబుదారీగా ఉండాలి? క్రీస్తు నందు భయంతో ఒకరికొకరు లోబడి ఉండాలి.

### 3. ఒకరితో ఒకరు ఒప్పుకోవాలి (యాకోబు 5:16)

మీ పాపాలను ఒకరితో ఒకరు ఒప్పుకోవాలి. కప్పుకోకూడదు. రోమన్ క్యాథలిక్స్ పోప్ చెవిలో ఒప్పుకున్నట్లు కాదు. మీరు ఏ విషయంలో అయితే సవాళ్ళను ఎదుర్కొంటున్నారో, మీ పాపాలను, తప్పులను ఒప్పుకోవాలి. యల్ టి జయచంద్రన్ గారు ఒకసారి ఈ విషయం నాకు చెప్పాడు. కల కత్తాలో ఒక ప్రార్థనా సహవాసంలో వాళ్ళు ప్రార్థి స్తున్నారు. ఒక సహోదరుని చూపించి ఆ సహోదరుడి హృదయంలో ఎంతో ద్వేషము, పగ ఉన్నది. దాన్ని బట్టి తన కడుపులో అల్సర్స్ పుండ్లు ఉన్నాయి అని చెప్పాడు. కొన్ని రోగాలు మన వ్యక్తిగత పాపాలను బట్టి వస్తుంటాయి. కొంతమంది వ్యక్తులంటే తనకు ద్వేషం, ఈర్ష్య ఉండడాన్ని బట్టి తన కడుపులో అల్సర్ పుండ్లు వచ్చాయి. ఓ రాత్రి ప్రార్థన సమయంలో ఆ యవ్వనస్తుడు తనలో ఉన్న వాటిని ఒప్పుకున్నాడు. ఆ తర్వాత దాని నుంచి స్వస్థత పొందాడు. ఒప్పుకోవడం అనేది చాలా మంచిది. మనమందరం కూడా మానవులుగా ఉంటున్నాము. దేవుని సహవాసంలో దేవుని ప్రజల మధ్య మన లోపాలు ఒప్పుకోవడం మంచిది.



### 4. ఒకరికొకరు వందనాలు చెప్పుకోవాలి (రోమా 16:16)

పవిత్రమైన ముద్దుతో ఒకరికొకరు వందనాలు చెప్పాలి  అని బైబిల్‌లో రాయబడి ఉంటుంది. అది సాధ్యం కాదు గానీ, మన సంస్కృతిని బట్టి దాన్ని చూడాలి. నేను గుజరాత్‌లో చదువుతున్నప్పుడు ఒక సంఘానికి వెళ్ళినప్పుడు నా వీపు వెనుక ఒకరు గట్టిగా కొట్టారు. అప్పుడు నేను యవ్వన క్రైస్తవుడిగా ఉన్నాను. నన్ను ఎవరు కొట్టారో వారిని తిరిగి మళ్ళీ కొడదాం అని అనుకున్నాను. చూస్తే మా క్లాస్ అమ్మాయి జాయిస్. తనకు నేను క్రైస్తవుడినని తెలియదు. తను ఆశ్చర్యపోయి గుజరాతీ కల్చర్‌లో ఇలా కొట్టి వందనాలు చెప్పింది. మన సంస్కృతిలో మనకు పద్ధతులున్నాయి. మీరు ఉంటున్న సంస్కృతిని బట్టి నీ సహోదరునితో, సహోదరీలతో ఆ విధంగా కమ్యూనికేట్  చేయాలి. కొన్ని దేశాల్లో ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటారు. దాని ముఖ్య ఉద్దేశం వందనాలు మనం సరైన రీతిలో వాళ్ళకి చెప్పాలి.

### 5. ఒకరినొకడు ఆదరించుడి (1థెస్స 4:18)

1 థెస్సలోనికలో అక్కడి నేపథ్యం ఏంటంటే ఒక వ్యక్తి మరణించిన సమయంలో తన భార్యను, తన భర్తను, లేక తల్లిదండ్రులను కోల్పోయినప్పుడు అది ఎంతో బాధగా పూడ్చలేనిదిగా ఉంటుంది. ఆ సమయంలో మనం వెళ్ళి ఆదరించాలి. అక్కడ ఉండటం అనేది చాలా ప్రోత్సాహం. ఆ బాధ నాకు కూడా తెలుసు. బాధలో ఉన్న వ్యక్తిని నువ్వు ఆదరించే వాడిగా, ఓదార్చే వాడిగా ఉండాలని దేవుడు అంటున్నాడు.

### 6. ఒకరిపట్ల ఒకరు దయ కలిగి ఉండాలి (ఎఫెసీ 4:32)

కృప కలిగిన మాటలు వాడాలి. మనం కఠినమైన పరిస్థితుల గుండా వెళ్తున్నాము. దేవుడు దయ, సున్నితత్వం కొరకు పిలుస్తున్నాడు. ఒకని యెడల ఒకడు దయ కలిగి, కరుణా హృదయులై ఉండాలంటున్నాడు. ఇబ్బందిలో ఉన్న వారిపట్ల నువ్వు జాలి చూపించాలి.

నీ సహోదరుడు, నీ సహోదరి, నీ భార్య పట్ల నువ్వు కరుణ కలిగి ఉండాలి. మేము పాస్టర్స్‌ని రిక్రూట్ చేసుకున్నప్పుడు కొన్ని ప్రశ్నలు అడుగుతాము. నీ భార్య పుట్టినరోజు చెప్పమని, నీ భార్యకి ఇష్టమైన రంగు ఏంటో చెప్పు అని అడిగితే వారికి గుర్తు ఉండదు. తన అభిరుచులను నువ్వు గమనించి దానికి అనుగుణంగా సాగాలి. చిన్న చిన్న విషయాలు, కానీ చాలా ప్రాముఖ్యమైన విషయాలు.

### 7. ఒకరికొరకు ఒకరు ప్రార్థన చేయండి (యాకోబు 5:13)

మా బైబిల్ కాలేజీలో కొన్ని వేల పుస్తకాలున్నాయి, నాకు ఇష్టమైన  ఒకే ఒక పుస్తకం ఉంది. అనేక సార్లు చదివాను. మీరందరూ కూడా ఆ పుస్తకాన్ని చదవాలని ఆశపడుతున్నాను. వై రివైవల్ టారీస్ అనేది లియొనార్డ్ రావెన్ హిల్ అనే వ్యక్తి రాసిన పుస్తకం. నా వ్యక్తిగత ప్రార్థన జీవితాన్ని ఎంతగానో సవాలు చేస్తుంది. నా క్రైస్తవ జీవితాన్ని సవాలు చేసింది. ప్రార్థించడానికి, సంపూర్ణ ప్రార్థనలో పాల్గొనడానికి నన్ను పురికొల్పింది. ఆదివారం ఉదయకాలంలో సంఘమంతా నిండిపోతే ఆ సంఘం ఎంతో గొప్ప సంఘం. ఆదివారం సాయంత్రం సంఘం నిండిపోయింది అంటే ప్రసంగించే వ్యక్తి గొప్పవాడని. కానీ సంపూర్ణ రాత్రి ప్రార్థనలో ఉన్నప్పుడు దేవుడు ప్రాధాన్యమైన వ్యక్తిగా ఉంటున్నాడు. మనమందరం ఒక్క వ్యక్తిగత ఆల్ నైట్ ప్రేయర్, సమాజముగా ఒక ప్రార్థనా సహవాసం కలిగి ఉండాలి. ప్రార్థిస్తున్నప్పుడు దేవుని భారం నీ హృదయంలో వస్తుంది. ప్రార్థించని ఒక పాస్టర్, గ్రాడ్యుయేట్ ఉన్నట్లయితే అతను ఆటలాడుకున్నట్లు, తప్పిపోయినట్లుగా ఉంటుంది. ప్రార్థన యొక్క రహస్యం ఏంటంటే రహస్యంగా ప్రార్థించడమే. ఊపిరి ఏ విధంగా తీసుకుంటావో ఆ విధంగా నీ ప్రార్థన ఉండాలి. నీవు లేకుండా నేను ముందుకు వెళ్ళలేను ప్రభువా అని చెప్పాలి. గనుక ఒకరి నిమిత్తం ఒకరు ప్రార్థన చేయడాన్ని నేర్చుకుందాము.

(సెంట్రల్ రాయలసీమ స్పైకాన్‌లోని చివరి ఎక్స్‌పోజిషన్ సంగ్రహణ)

– **ఆరోన్ రజనీకాంత్,** హైదరాబాద్



ప్రత్యేకం

# హింసల్లో యథార్థతను, పరిశుద్ధతను కాపాడుకొందాం

"ప్రతి విశ్వాసి కడుపు నిండిన ఒక భిక్షగానితో సమానం. తన కడుపు నింపిన దాత గురించి ఆకలితో అలమటించిపోతున్న తోటి భిక్షగాళ్ళకు చెప్పడం అతని కనీస కర్తవ్యం అన్నాడు" ఒక ప్రఖ్యాత బోధకుడు. నిజమే అలా చేయక పోవడం స్వార్థమే అవుతుంది. అపో. కా. 1:8లో చెప్పినట్లు మన జీవితం, మన మాటలు యేసు ప్రభుని మరణానికి, పునరుత్థానానికి సాక్ష్యం కావాలి. రక్షించబడిన తర్వాత ఇతరులతో సువార్త పంచుకోవాలనే తృష్ణ లేకపోతే ఆ రక్షణ అనుభవం ప్రశ్నార్థకమే! ఎందుకంటే మానవ మనస్సు సంతోషకరమైన విషయాలను ఇతరులతో పంచుకోకుండా వుండలేదు. ఆదిమ సంఘంలో సువార్త ప్రకటన వారు జీవించటానికి కారణంగా మారింది. రక్షింపబడిన వెంటనే ప్రతి విశ్వాసి ఒక యుద్ధంలో పాలిభాగస్తుడు అవుతాడని దేవుని వాక్యం సెలవిస్తుంది. ఆ యుద్ధం మౌలికంగా ఆత్మీయ యుద్ధం అయినప్పటికి, కొన్నిసార్లు భౌతిక హింస కూడా దానిలో భాగమే అవుతుంది. అయితే ఈ పోరాటంలో విశ్వాసి ప్రభువు పక్షంగా, సాతాను, వాని అనుచరులతోను, లోకవ్యవస్థతోను పోరాడాలి కాని వ్యక్తులతో కాదు. ఈ పోరాటంలో ఆత్మ సంబంధమైన యుద్ధోపకరణాలు, దేవుడనుగ్రహించు సర్వాంగ కవచం యొక్క అవసరత చాలా ఎక్కువ. అపోస్తలులు, స్తెఫెను, పౌలు, క్రైస్తవ హతసాక్షుల జీవితాలు ఈ సత్యం మనకు తెలియచేస్తాయి. వారి నాయకుడైన ప్రభువు కొన్ని సార్లు వారు తనకోసం ప్రాణాలు అర్పించడానికి అనుమతించాడు, మరి కొన్నిసార్లు అద్భుతంగా ఆదుకున్నాడు. ఆయన అనుమతి లేకుండా హాని విశ్వాసులను తాకదు. దేవుని చిత్తంలో మేలు చేసి కీడు అనుభవించడం కూడా ఉంటుంది. (1 పేతురు 3:17). ఈ పోరాటంలో ప్రతి విశ్వాసి దేవుని నిబంధనల ప్రకారం పోరాడాలి కాని, విరుద్ధంగా పోరాడే పోరాటాన్ని ప్రభువు అనుమతించడు. దేవుని నిబంధనలలో అతిప్రాముఖ్యమైనవి యథార్థత, పరిశుద్ధత. ఈ రెండింటి విషయంలో రాజీపడి చేసే పోరాటంలో ఓటమి తప్పదు. సువార్త సేవలో సువార్తికుని జీవితం, మనుష్యులతో మాట్లాడకపోతే అతని నోరు మాట్లాడినా పెద్ద ప్రయోజనం ఉండదు.

## యథార్థత, పరిశుద్ధతల మధ్య తేడా ఏంటి?

ఈ రెండు సుగుణాలు ప్రాముఖ్యమైన విశ్వాసి జీవిత ప్రమాణాలు. యథార్థత దేవుని వెంబడించడంలో, ఆయన మాటకు విధేయత చూపడంలో ఆ వ్యక్తి యొక్క అవిభాజ్య మనస్సును తెలియ చేస్తుంది. ఆ వ్యక్తి మాట ఎప్పుడూ మారదు. అవకాశాన్ని బట్టి మాటలు మార్చే మన రాజకీయ నాయకులు, ఏది యథార్థత కాదో దానికి సాదృశ్యంగా ఉంటారు. ఇంగ్లీషులో దీనిని ఇంటిగ్రిటీ అంటారు. ఇంటిగ్రిటీ సంపూర్ణ సంఖ్య అనే పదంలోనుండి వచ్చింది. ఆ వ్యక్తి యొక్క ప్రవర్తన, జీవితం, పరిస్థితులను బట్టి మారదు. యథార్థతకు వ్యతిరేక పదం వేషధారణ.

పరిశుద్ధత అనగా ప్రత్యేకించబడిన జీవితం, దేవుని

కోసం ప్రత్యేకించబడిన, ప్రతిష్ఠించబడిన జీవితం, మౌలికంగా ఆ వ్యక్తి దేవుని కొరకు నైతికంగా నిర్దోషిగా, ప్రతి పాపము నుండి, దేవుని చిత్తము కాని దాని నుండి తనను తాను ప్రత్యేకించుకొనిన జీవితం. పరిశుద్ధ జీవితం జీవించే వ్యక్తి దేవుని ప్రమాణాల ను నిర్వర్తించడం కోసం తక్కిన వారి నుండి, ఇతర జీవనశైలి నుండి వేరుగా ఉంటాడు.

ఈ రెండు లక్షణాలు ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయి. పరిశుద్ధత యథార్థతలో ప్రత్యక్ష పరచబడుతుంది. ఒకవ్యక్తి పరిశుద్ధ జీవితం జీవించేటప్పుడు ద్వంద్వ మనస్కుడై ఉండడం సాధ్యం కాదు. యథార్థంగా జీవించేవాడు తన కార్యాల న్నిటిలో నమ్మదగినవాడుగా ఉంటాడు. ఉదా: కుటుంబంలో, ఉద్యోగంలో, సమాజంలో, పరి శుద్ధతలో జీవించే వ్యక్తి, దేవుని ప్రమాణాలు నిర్వ ర్తించడంలో దేనితో రాజీ పడడు.

### విశ్వాస జీవితంలో శత్రుదాడి

పరిశుద్ధ విశ్వాస జీవితం ఒక యుద్ధం లేక పోరాటం. అక్కడ విశ్వాసి తన శరీర ఆశలతోను, లోక వ్యవస్థతోను, సాతానుతోను పోరాడాల్సి ఉంటుంది (యాకోబు 4:1-10), దేవుని పక్షంగా పోరాడే ప్రతి విశ్వాసి యథార్థత, పరిశుద్ధత అనే రెండు షరతులు నెరవేర్చాలి. అవి మన జీవితంలో మనల ను దేవునికి అంగీకారమైన జీవితం జీవించడానికి, దేవుని ప్రమాణాలను, చిత్తాన్ని జరిగించడానికి ప్రత్యేకతను కలిగి ఉండడానికి సహాయం చేస్తాయి. విశ్వాసుల విశ్వాసం మీద దాడి మూడు అంచెలుగా లేక స్థాయిలలో జరుగుతుందని యాకోబు పత్రిక వివరిస్తుంది.

**మొదటి స్థాయి** విశ్వాసి తన శరీరంలో ఉన్న పాప స్వభావం నుండి వచ్చే భోగేచ్ఛలతో పోరాటం సాగించాలి. ఈ భోగేచ్ఛలు ఆ విశ్వాసి జీవితంలోనికి మలినాన్ని తీసుకొని వస్తాయి. తద్వారా పరి శుద్ధతను కోల్పోయేటట్లు చేస్తాయి. ప్రస్తుత కాలంలో వయస్సుతో నిమిత్తం లేకుండా మనస్సును, ఆలోచనల ను కలుషితం చేసి వ్యక్తిగతంగా, కుటుంబాలలో, సమాజంలో అపవిత్రతను కలుగచేస్తున్న, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలతో విశ్వాసికి పోరాటం. ఎంతో మేలు వున్న ఈ సాధనాన్ని శత్రువు పాపం చేయడానికి విస్తృతంగా వినియోగిస్తున్నాడు. ఈ వేటగాని ఉరి లేక వలలో చిక్కుకున్న విశ్వాసు లెందరో! భార్యాభర్తల మధ్య ఏకత్వాన్ని కలుగజేసే కమ్యూనికేషన్‌కి చెక్ పెట్టి, మెసేజ్‌లు పంపాలి అనే నెపంతో గంటల కొలది సమయాన్ని వృధాచేయడం దేవుని చిత్తం ఎలా అవుతుంది? పోర్నోగ్రఫీకి అల వాటుపడిన గ్రాడ్యుయేట్స్ జీవితాలలో పరిశుద్ధతను ఎలా చూడగలము? దేవుని గ్రంథం చదివేటప్పుడు ఆ కళ్ళు ఆశ్చర్యకరమైన సంగతులను ఎలా చూడగలవు? కాపరిలేని గొర్రెలవలెవున్న విద్యార్థి లోకాన్ని ఆ కళ్ళు ఎలా చూస్తాయి? దేవునితో ఉండే సహవాసం అనుభవించకుండా చేయడమే శత్రువు ప్రధాన ఉద్దేశ్యం. అక్కడ ఓడిపోయిన విశ్వాసి యుద్ధరంగంలో ఆయుధం లేని సైనికుడే! యాకోబు 4:2లో రాసిన “మీరు అడుగనందున మీకేమియు దొరకదు” అనే సత్యం మన ప్రార్థనా జీవితం యొక్క ప్రాధాన్యత తెలుపుతుంది. ప్రార్థన మీద ఆధారపడని విశ్వాసి తన స్వశక్తి మీద ఆధారపడిన వాడే!

**రెండవ స్థాయి** యుద్ధము, లోక వ్యవస్థతో చేసే పోరాటం. ఈ పోరాటంలో శత్రువు మనలను తన “అబద్ధం”తో ఎదుర్కొంటాడు. లోక వ్యవస్థలో అబద్ధం లేక పాక్షిక నిజం మాత్రమే ఉంటాయి. ఈ అబద్ధం మన మనస్సులలోనికి సత్యము అనే ముసుగులో ప్రవేశించడానికి ప్రయత్నిస్తుంది. విశ్వాసి తన పిలు పు, ప్రత్యేకతను మెళకువతో పరిరక్షించుకోకపోతే ఓటమి తప్పదు. ఈ విషయంలో మనకు దేవుని వాక్యం, ప్రార్థన సహాయం చేస్తాయి. లోక వ్యవస్థలో దేవుని వాక్యమునకు గాని యథార్థతకు గాని, పరి శుద్ధతకు గాని స్థానం లేదు. ఇవి చెడు దినములు, ఎక్కడ చూచిన సౌఖ్యం కోసం, సంతోషం కోసం రకరకాల ప్రోత్సాహకాలు లభించే దినాలు. వాటిని సంపాదించుకోవడానికి, వాటిలో పాలుపొందడానికి, అవకాశాలు వచ్చినా, మన పిలుపు, ప్రత్యేకతల ను పరిగణ లోనికి తీసుకొని వాక్యానుసారంగా నిర్ణయాలు తీసుకోవాలి. ఉద్యోగాలలో పేరు ప్రఖ్యాతుల కొరకు, ధనార్జన కొరకు తపన, పోటీ కొరకు కాకుండా, వృత్తి ధర్మం నెరవేర్చడానికి, మనుష్యుల మెప్పు కోసం గాక దేవునికి లెక్క అప్పగించాలనే ధ్యేయంతో పనిచేయాలి. శత్రువు మనం చేయని అపరాధాన్ని, మనపై మోపే వ్యక్తులను వాడుకుంటాడు. అసూయ ద్వేషాలను నిర్హేతుకంగా మనపై కలిగించినప్పుడు మన స్పందన ద్వేష, దోష రహితంగా ఉండాలి. కీడుకు ప్రతికీడు కాక, క్రీస్తు

ప్రభువు ఎమాదిరి మన దారి కావాలి. దానియేలు లాంటి భక్తుల జీవితాలు మనకు ప్రోత్సాహాన్ని కలిగిఁచాలి. అన్యాయంగా శ్రమపడవలసి వచ్చినప్పుడు, దూషణకు గురైనప్పుడు, ప్రభువు చూపిన మార్గం ఎంచుకోవాలి. ఇది చాలా కష్టమైన పరిస్థితి, కుటుంబం కూడా దీనిలో పాలిభాగం తీసుకుంటుంది కాబట్టి పరసంబంధమైన జ్ఞానం కోసం ప్రభువు మీద ఆధార పడాలి.

**మూడవ స్థాయి** పోరాటం భౌతికంగా హింసించ బడడం. ఈ పోరాటంలో శత్రువు మనకు వ్యతిరేకంగా అసూయ, ద్వేషాలతో నిండిన ప్రజలను మనకు వ్యతిరేకంగా రేపి మనలను సవాలు చేయవచ్చు. అప్పుడు మన పోరాట విధానం దీనత్వం, సాత్వికం. లోకంలో దీనత్వం, సాత్వీకాలు చేతగానితనంగా చెప్పబడతాయి. కానీ దేవుని వాక్యంలో అవి హాని చేయకలిగి వుండి కూడ చేయకుండా నిగ్రహించుకొనే శక్తిగా అభివర్ణించబడ్డాయి. ఈ లక్షణాలు మన స్వభావంలోనివి కాదు. కేవలం ఆత్మ దేవుని అధికారం  కింద మాత్రమే నేర్చుకొనగలిగిన లక్షణాలు (మత్త 11:29). మన ప్రభువు కొన్ని సార్లు ధైర్యంగా మాట్లాడాడు, మరికొన్నిసార్లు మౌనం వహించాడు. కొన్నిసార్లు ఆ పరిస్థితి నుండి దూరంగా వెళ్ళిపోయాడు. దేవుని జ్ఞానంతో నింపబడినపుడు ఈ విషయాలకు ఎలా స్పందించాలో తెలుస్తుంది. కీడుకు ప్రతికీడు చేయడం మానవ సహజం, కాని ప్రభువు నేర్పించిన మార్గం క్షమాపణ, ప్రేమ, అహింస. సాధారణంగా మనకు భౌతికంగా హాని చేసిన వారిపైన తిరిగి హాని చేయాలనిపించడం సాధారణం. కానీ విశ్వాసి తన పరిశుద్ధతను కాపాడుకోవడానికి చూపే స్పందన వేరుగా ఉండాలి. చేసిన హానికి ప్రేమతో బదులు చెప్పడం, కీడుకు తిరిగి మేలు చేయడం, వారి కోసం ప్రార్థించడం విశ్వాసి కర్తవ్యం.

కాంధమాల్, ఒరిస్సాలో గ్రేహం స్టెయిన్స్ ఆయన ఇద్దరు పిల్లలను మతఛాందసవాదులు మంటలకు ఆహుతి చేసినప్పుడు, ఆయన భార్య గ్లాడిస్ యొక్క స్పందన భారతదేశాన్ని ఆశ్చర్యంలో ముంచివేసింది. ఆమె తన భర్త, పిల్లల మరణం గురించి స్పందిస్తూ "నా భర్త యేసు ప్రభువును అమితంగా ప్రేమిస్తాడు, ఆ ప్రభువు మాకు క్షమించడం నేర్పించాడు, నా భర్త గురించి, పిల్లల గురించిన దు:ఖం ఉంది కాని ఆ కార్యం చేసిన వారిపై కోపం లేదు" ప్రభువు ప్రేమ గురించి ఆమె చెప్పిన మాటలు భారత దేశం అంతా విన్నది. ఆమె భర్త కుష్ఠరోగుల మధ్య చేసిన పరిచర్యను అదే ప్రాంతంలో కొనసాగిస్తూ వారి మధ్యలో నివసిస్తూ తన యథార్థతను తెలియచేసింది. ఆమె ప్రేమ గురించి, క్షమాపణ గురించి ప్రసంగాలు ఇవ్వలేదు కాని జీవించి చూపించింది. యుఇయస్ఐ-ఏపిలో కావలసింది ఇలాంటి గ్రాడ్యుయేట్లే.

కాంధమాల్ లోని కాంతేశ్వర్ దిగాల్, ఛత్తీస్ ఘడ్ లోని కోసాకవాసి, బిందుసోధి కూడా మతఛాందసవాదుల బెదరింపులకు తమవిశ్వాసాన్ని వదులుకోలేదు. దానికి వారు చెల్లించిన క్రయం గొప్పది. కాంతేశ్వర్ చంపబడ్డాడు. బిందుసోధి, కోసాకవాసి ఇళ్ళు, ఆస్తి కోల్పోయారు కాని వారి విశ్వాసాన్ని విడచిపెట్టకుండా తమ యథార్థతను నిరూపించుకున్నారు. మణిపూర్‌లో జరిగిన అల్లరులలో వందల చర్చిలు కూల్చబడ్డాయి, కాపరులు నిరాశ్రయులయ్యారు. ప్రజలు ఆస్తులు కోల్పోయి, శరణార్థులుగా బ్రతుకుతున్నారు. సహో. సయాన్ అనే మణిపూర్ సేవకుడు "మీరు మా ఆస్థిపాస్తులను నాశనం చేయగలరు కాని, మా విశ్వాసాన్ని, సమర్పణను నాశనం చేయలేరు" అని ధైర్యంగా చెప్పాడు.

ప్రియ సహోదరుడా, సహోదరీ, గ్రాడ్యుయేట్‌గా రాబోయే హింసకు నీవు సిద్ధమేనా? నీ జీవితంలో యథార్థత, పరిశుద్ధతల విషయంలో నీవు తీసుకొన్న జాగ్రత్త లేంటి? యథార్థత నీ దృక్పథం అయితే పరిశుద్ధత నీ జీవన శైలిగా ఉంటుంది. దేవుని వాక్యం దేవుని చిత్తాన్ని నీకు తెలుపుతుంది. ఆ చిత్తాన్ని జరిగించడం నీ స్వశక్తి వలన సాధ్యం కాదని నీకు తెలుసా? ఆత్మ దేవుని అధికారం ఒక్కటే మన బలం. ఆ బలముతో, ఆ అధికారంతో ఆయనపై ప్రార్థనలో ఆధారపడుతూ, మన ఏకత్వాన్ని కాపాడుకుంటూ, ఈ ఆత్మీయ యుద్ధంలో దేవుని పక్షంగా పోరాడుదాం. ఈ యుద్ధంలో మనం చెల్లించవలసిన క్రయం ఎంతైనా చెల్లించుదాం కానీ మన యథార్థత, పరిశుద్ధత విడవకుండా విశ్వాసాన్ని కాపాడుకుందాం. జయం మనదే!.

**– కె. డేవిడ్ రాజ్ కుమార్,** గుంటూరు

పిబియస్



యుఐయస్ఐ హృదయ స్పందన

# వాక్య అధ్యయనమే

ఒక పొలంలో వజ్రాలున్నాయని తెలిస్తే వాటిని సంపాదించడానికి ఎంతో కష్టపడి ఎన్నో పరికరాలు తీసుకొని వెళ్ళి, సమయం వెచ్చించి, ప్రయాసతో తవ్వి తీసుకుంటాం. అవి మనకు అందుబాటులో ఉన్నాయని తెలిస్తే అస్సలు వదిలి పెట్టం ఎందుకు? వాటి విలువ, ప్రాముఖ్యత, ప్రశస్తత మనకు తెలుసు. గనుల్లో బంగారం, ప్రశస్త లోహాలు తవ్వేవాళ్ళు వాళ్ళు పొందబోయే వాటి విలువపై వాళ్ళ మనస్సు, దృష్టి పెడతారు. అది పొందడానికి సమయం వెచ్చించాలని తెలుసు. శ్రేష్టమైనది ఏది పొందాలన్నా శ్రద్ధతో కష్టపడాలి. అప్పుడే దానిని మనం సంపాదించుకోగలం, అనుభవించగలం దానిలో ఆనందించగలం. దేవుడు మనకు నిధిగా ఇచ్చిన లేఖన భాగాలు అటువంటివే. వాటిని లోతుగా అధ్యయనం చేస్తేనే అత్యంత విలువైన సత్యాల నిధిని సొంతం చేసుకోగలం. 'వేలకొలది వెండి బంగారు నాణెములకంటె నీ విచ్చిన ధర్మశాస్త్రము నాకు మేలు' (కీర్తనలు 119 :72) అని కీర్తనాకారుడు అంటాడు.

## దేవుని వాక్య అధ్యయన ప్రయోజనాలు

"దైవావేశమువలన కలిగిన ప్రతిలేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్షచేయుటకును ప్రయోజనకరమై యున్నది" (2 తిమోతి 3:16).దేవుని వాక్యంలో ప్రతీ పుస్తకం దైవప్రేరితం, ప్రతి పుస్తకం, ప్రతి సత్యం, ప్రతి వచనం, బైబిల్‌లో ప్రతి పుటలో దేవుడు మన కోసం బయలుపరచిన ఆజ్ఞలు, వాగ్దానాలు ప్రయోజనకరమైనవే. ప్రతీది దైవప్రేరితం కాబట్టి చదవడానికి, అధ్యయనం చేయడానికి కేవలం ఏదో వచనం, భాగం ఎంచుకోకూడదు. మన కిష్టమైన వచనాలను సొంతం చేసుకొని, మనలను గద్దించే భాగాలను ఉపేక్షించడం కాదు. క్రీస్తు కోసం పరిణతి చెందిన శిష్యులుగా జీవించాలంటే, దేవుడు మనం నేర్చుకోవాలని ఇష్టపడే లేఖనభాగాలు మనతో మాట్లాడడానికి, బోధించడానికి అనుమతినివ్వాలి.

*దేవుని ఆత్మ దేవుని వాక్యంతో దేవుని భక్తులను దేవుని కుమారుని స్వరూపంలోకి మారుస్తుంది.*

– రిక్ వారెన్.

- దేవుని వాక్యం మాత్రమే యేసు క్రీస్తుకు, ఆయన రక్షించే కృపకు మార్గం చూపుతుంది.
- దేవుని వాక్యం పక్కన పెట్టి పరిశుద్ధ జీవితం పెంపొందించుకోలేము (కీర్తనలు 119:9).
- దేవుని వాక్య అధ్యయనం మన జీవన శైలిని, ఆలోచనా విధానాన్ని, నమ్మకాలను, ఒప్పుదలను, వైఖరిని, ప్రవర్తనా సరళిని మలుస్తుంది, మార్చుతుంది (కీర్తనలు 119:5).
- దేవుని వాక్యంతో మనస్సు నింపుకొని, ఆయన ఉపదేశానికి విధేయత చూపితే, ఆయన నీతి మార్గాలలో నడిపిస్తాడు.
- దేవుడు నిన్ను చేయమని చెప్పిన ప్రతి మంచి కార్యం చేయడానికి వాక్యం సంసిద్ధం చేస్తుంది.

సోషల్ మీడియాకు వెచ్చించిన సమయంలో కొంత శాతం సహితం వెచ్చించక, లేఖన భాగాల అధ్యయనాన్ని మన బిజీ జీవితంలో ఏదో మూలకు నెట్టివేస్తున్నాం. దేవుని వాక్యాన్ని దాని మూల సందర్భానికి అనుగుణంగా పరిపూర్ణ అవగాహన పొందకుండా ఇతరుల ప్రసంగాల వీడియోలు, ఏఐ, ఛాట్ జిపిటిల సమాచారం నుంచి మన సందేశాలు, బైబిల్ స్టడీస్ ఉద్భవిస్తున్నాయి. ఈజీ మనీ సంపాదనలా ఈజీ సందేశాలు, ఈజీ బైబిల్ స్టడీస్, ఈజీ సిద్ధాంతాలు, ఈజీగా దేవుని వాక్యానికి భావం చెప్పడం నేర్చుకున్నాం.

- దేవుడిచ్చిన పని చేయడానికి నీ సామర్థ్యం సరి పోదని భావిస్తే లేఖన భాగాలను పరిశోధించు, ఆయన పని నెరవేర్చడానికి అవసరమైన జ్ఞానం దొరుకుతుంది (యెహోషువా 1:8)
- మనకు బోధించిన సిద్ధాంతాల విశ్వసనీయతను గుర్తించడానికి, అంచనా వేయడానికి సాయ పడుతుంది.
- మనం ఒకరినొకరు సరిదిద్దుకోవడంలో మనకు మూలాధారం లేఖన భాగాలే కావాలి.
- దేవుని వాక్యంలో లోతుగా వేరుపారి లేకపోతే ప్రతివిధమైన అబద్ధపు బోధలు, జీవన శైలులు, నడవడుల కలగలుపుల దాడికి లోనై అవి దేవునికి చెందినవా? కాదా? అని తేల్చుకోలేని సందిగ్ధావస్థలో పడతాం.

దేవుని వాక్యం కేవలం ప్రసంగాల కోసం, బోధ కోసం, వాగ్దానాల కోసం, ఆదరణ కోసం అధ్యయనం చేయడం కాదు. ఒక విశ్వాసి దాని సహాయం లేకుండా తన జీవన విధానాన్ని ముందుకు కొనసాగి ంచడం అసాధ్యం. కారులో పెట్రోలున్నది ఫర్వాలేదు అనుకునే ఉదాసీన స్వభావం మనలో ఉంటుంది. నేను బాగానే ఉన్నాను అనే ఉదాసీన వైఖరి ఆధ్యాత్మిక ప్రమాదాలలో నెట్టి వేసే అవకాశం ఉంది.

ఇటువంటి వాక్యం అధ్యయనం చేయాలనే తపన ఉందా? గతంలో చైనాలోని విశ్వాసులు తమ సొంత బైబిల్ కాపీ కోసం నెలలు, సంవత్సరాలు దానిని రాయడానికి వెచ్చించే వాళ్ళట. వాళ్ళ గృహాలకు లేఖన భాగాలను తెచ్చుకునే అవకాశం లేనప్పుడు దానిని కంఠత పెట్టేవాళ్ళట. ప్రస్తుతం మనకు అనేక బైబిల్ ప్రతులు అందుబాటులో ఉండి ఉదయం, సాయంత్రం ధ్యానించలేకపోవడాన్ని వాళ్ళు ఊహించలేరు, అర్థం చేసుకోలేరు!

## దేవుని వాక్య భావం గ్రహించడం అనివార్యం

దేవుని వాక్యాన్ని కంఠత పెట్టి, కేవలం చదివినంత మాత్రాన వ్యక్తులు, పరిస్థితులు, మారిపోవడానికి బైబిల్ మ్యాజిక్ పుస్తకం కాదు. వాక్యం హృదయం లోనికి చొచ్చుకొని వెళ్ళి, జీవితాన్ని మార్చే శక్తిని విడుదల చేయడానికి ముందు దానిలోని సందేశాన్ని అర్థం చేసుకోవాలి.

“దేవుని వాక్యాన్ని సక్రమమైన రీతిలో అర్థం చేసుకోవడం ప్రస్తుత కాలంలో క్రైస్తవులను వెంటాడుతున్న ముఖ్యమైన సమస్య. దీనిలో మనం ఏమి నమ్ముతున్నాం, మనం ఎలా జీవించాలి, అందరం కలసిమెలసి ఎలా ఉండాలి, ఈ ప్రపంచానికి మనం ఏమి అందించాలి అనే అంశాలు ఇమిడిఉన్నాయి” అని అంటాడు జాన్ బాల్చిన్.

మూల భాషల నుంచి (హెబ్రీ, గ్రీకు, అరామిక్) అనువదించిన లేఖన భాగాలను కేవలం చదివితే అర్థం కావా? దానికి మరలా వివరణ కావాలా? అర్థం చేసుకోవడమంటే మన మనస్సుకు వచ్చిన తలంపులు, భావాలు దానిలో చొప్పించడం కాదు. లిఖించిన లేఖన భాగాలలో దేవుని మనస్సు, ఆలోచన, సందేశాన్ని వెలికి తీయడం. పాఠకుని ఆలోచన కంటే దేవుడు ఎంచుకున్న రచయిత ఉద్దేశ్యం ప్రాముఖ్యం. వాక్యాన్ని ఉన్నదున్నట్టుగా అర్థం చేసుకోకపోతే దేవుని వాక్యంలో దేవుడు చెప్పాలనుకున్న సందేశాన్ని కోల్పోయే ప్రమాదముంది. లేఖన భాగాల సత్యాలను కలిపి ఒక స్పష్టమైన ఏక భాగానికి తీసుకుని వచ్చే ప్రక్రియ సమయం తీసుకుంటుంది. వాక్యభాగాన్ని, దాని చుట్టూ ఉన్న సమాజాన్ని, పరిశుద్ధాత్మ స్వరాన్ని ఓపికతో వినాల్సి ఉంటుంది.

లేఖన భాగాలకు వివరణ ఇచ్చే సందర్భాలు వాక్య భాగంలో అనేక సార్లు చూస్తాం. దేవుని ప్రజలు దేవుని వాక్యాన్ని ప్రేమించక, అధ్యయనం చేయక, విధేయత చూపకపోతే దేవుని ఆశీర్వాదాలను కోల్పోతారు. ఇశ్రాయేలుదేశం దేవుని మాటను పెడచెవిని పెట్టి, పట్టించుకోకుండా, అవిధేయత చూపిన కారణంగా

మూల్యం చెల్లించాల్సి వచ్చింది. అదే డెబ్భై ఏళ్ళ చెర. ఇశ్రాయేలీయులు చెర నుంచి వచ్చిన తర్వాత డెబ్భై సంవత్సరాలు ధర్మశాస్త్ర బోధన దొరకక ఎజ్రా, ఇతర శాస్త్రులను ధర్మశాస్త్ర గ్రంథాన్ని తెచ్చి వివరించమని, చొరవ తీసుకొని అడిగారు. ఆరు గంటలు నీటి గుమ్మం వద్ద నిలుచుని వివరించిన ధర్మశాస్త్ర గ్రంథాన్ని విని విధేయత చూపారు (నెహెమ్యా 8:1-18). ఎజ్రా, నెహెమ్యాలు ఇశ్రాయేలీయుల జీవన విధానంలో దేవుని వాక్యానికి ప్రధాన ప్రాధాన్యత నిచ్చారు. వాళ్ళకి లేఖన భాగాలను స్పష్టంగా చదివి వినిపించి వాళ్ళు గ్రహించడానికి, దానికి అర్థం చెప్పారు (నెహెమ్యా 8:1-10). కందాకే క్రింద పనిచేసే మంత్రికి యెషయా గ్రంథం లో 53వ అధ్యాయం కేవలం చదివితే అర్థం కాకపోతే ఫిలిప్పు దానిని వివరించాడు (అపో.కా 8:26-40).

అనంతుడైన, ఆత్మ దేవుడిని, పరిమితి గల, శరీర ఆకారంలో నున్న మనిషి అర్థం చేసుకోవడం కష్టం. దేవుడు ఆయన చెప్పాలనుకున్నది ఆయన భాషలో చెప్పాడు, యూదులు దానిని వాళ్ళ భాషకు అనుగుణంగా అర్థం చేసుకున్నారు. ఉదా:యూదులు ఏదైనా చెరిగి పోకుండా ఉండడానికి పచ్చ బొట్టు వేసుకుంటారు. నేను నిన్ను మరచిపోను అనడానికి దేవుడు నిన్ను అరచేతిలో చెక్కుకున్నాను అన్నాడు. ఇది మనకు అర్థమయ్యే భాష. దేవుడు ప్రాథమిక భాషలో ఆయన శాశ్వత విలువలను మనిషికి తెలియ చేయాలి. దానిని అన్ని భాషలలోనికి అనువదించాలి. (ఇది పెద్ద సమస్య) దేవుని భావాన్ని, రచయిత మూల పాఠకులు ఏమి అర్థం చేసుకోవాలని రాశాడో దాని భావాన్ని మనం అర్థం చేసుకోకుండా ప్రస్తుతం వాక్య భాగం నాకేమి చెపుతుంది? అని భావాన్ని వెలికి తీయడానికి ప్రయత్నిస్తే వాక్యాన్ని అపార్థం చేసుకుంటాం, తప్పుగా అన్వయించుకుంటాం.

లేఖన భాగాలు మనకోసం తరతరాల, యుగ, యుగాల ప్రజల కోసం రాసినప్పటికీ, అవి మన సందర్భంలో రాయలేదు. దగ్గర, దగ్గర నలభై విభిన్న రచయితలు, విభిన్న ప్రదేశాలలో, విభిన్న ప్రజలకు, వాళ్ళ నిర్దిష్ట అవసరతలకు తగిన విధంగా వందల సంవత్సరాల వ్యవధిలో, విభిన్న సందర్భాల్లో రాశారు. ఈ దేవుని వాక్యం కేవలం చదివితే దానిలోని లోతైన సత్యాలు అర్థం కావు.

## భావం గ్రహించడంలో సమస్యలు

ప్రస్తుతం మన చేతిలోనున్న బైబిల్ ఇద్దరు రచయితల, దేవుడు, మానవుడు గ్రంథకత్వం కలిగినది. దేవుని అధికారం, శక్తి కలిగిన వాక్యంగా ఉండి, అనేక రచయితల రచనలతో, విభిన్న సంస్కృతుల, సందర్భాలతో, విభిన్న రచనా శైలులతో మలచబడిన విలక్షణమైన, విశేషమైన పుస్తకం. దేవుని సందేశం చరిత్రలో ఒక నిర్ధిష్ట పరిస్థితులలో జీవించిన వ్యక్తుల అవసరాలకు రాసిన పుస్తకం. కాబట్టి వాళ్ళ పాదరక్షలలో మన కాళ్ళు పెట్టి వాళ్ళ పరిస్థితులను అర్థం చేసుకోవడం అవసరం. వాక్య భాగం నాకు ఎటువంటి సందేశాన్ని ఇస్తుంది అని ప్రశ్నించక ముందు అప్పటి ప్రజలకు అందించిన మూల సందేశం ఏమిటి? అని ప్రశ్నించుకోవాలని ముందే చూశాం. దేవుని వాక్యం అర్థం చేసుకోవడం కొంత సంక్లిష్టమైన, గందర గోళంతో కూడిన పని. అది దేవుని వాక్యం కానీ మానవ మార్గాల ద్వారా కలిగింది. దేవుని ఆజ్ఞలు సంపూర్ణమైనవి కానీ విభిన్న చారిత్రాత్మక సందర్భాలలో ఇవ్వబడిన ఈ సందేశం అందరికి చెందిన సాధారణ ఆదేశంగా ఎలా వర్తించుకోవాలి? దైవ సందేశం స్పష్టంగా ఉండాలి కానీ అనేక భాగాలు అస్పష్టంగా ఉంటాయి. పరిశుద్ధాత్మ పాత్ర అర్థం చేసుకోవడంలో అనివార్యమని నమ్ముతాం కాని ఆత్మ ప్రేరిత వాక్యాన్ని అర్థం చేసుకోవడానికి వేదాంత పాండిత్యం అవసరం. మనం వినాలని దేవుడు ఉద్దేశించిన సందేశం లేఖన భాగాలు తెలియపరచిన విభిన్న రచనా శైలితో కూడిన సాహిత్యంతో, కొన్ని వందల సంవత్సరాల వ్యవధి లో రాయడం జరిగింది.

కేవలం ఒక వచనాన్ని తీసుకుని దానికి పైన, క్రింద భాగాలతో సంబంధం లేకుండా దాని భావం గ్రహించడానికి ప్రయత్నించడం చిమ్మ చీకటి దారిలో వెలిగే కొవ్వొత్తి లాంటిది. ఆ వెలుగు కేవలం నీవెక్కడున్నావో తెలుసుకోవడం కోసం నీకు కొంత ధైర్యం ఇస్తుంది. దారిలో కొంత భాగాన్ని, సైన్ పోస్ట్‌ల ను గుర్తించడానికి ఈ కాంతి సరిపోవచ్చు, కానీ మొత్తం ఆ ప్రాంతాన్ని గుర్తించడానికి సరిపోదు. కేవలం ఆ ఒక్క కొవ్వొత్తి కాంతితో ముందుకు కొనసాగాలని ప్రయత్నిస్తే, తప్పు దారిలో ప్రవేశించే ప్రమాదముంది. ప్రస్తుత కాలంలో మన అధ్యయనాలు సహితం కొత్తపుంతలు తొక్కుతున్నాయి. అధ్యయనం చేసి,

అర్థం చేసుకునే వాళ్ళకు సులువుగా, అనుకూలంగా ఉండాలనే కారణాలతో హెర్మెన్యూటిక్స్ సూత్రాలను వర్తించే క్రమంలో సొంత విధానాలను చొప్పిస్తున్నాం. ఆ వాక్య భాగం లేక పుస్తకమంతటి దృక్కోణంలో, బైబిల్‌లో ఇతర పుస్తకాలతో పోల్చి అర్థం చేసుకోవడం పగటి పూట కనబడే దృశ్యాన్ని స్పష్టంగా వీక్షించడం లాంటిది.

## వాక్య భావాన్ని పొందడంలో పరిశుద్ధాత్ముని పాత్ర

మనం బైబిల్ చదివే సమయంలో రచయిత మనతోనే వుండే ఒకే పుస్తకం బైబిల్ అంటాడు ఒక భక్తుడు. దేవుని వాక్య సందేశాన్ని అర్థం చేసుకోవడానికి పరిశుద్ధాత్మ దేవుడు మనకు వెలిగింపునిస్తాడు. దేవుని ప్రజలను దేవుని సందేశంలోని సత్యాలను పరిశుద్ధాత్ముడు ఒప్పింపచేస్తాడు, ఆ సత్యానికి అనుగుణంగా జీవించడానికి సామర్థ్యాన్ని ఇస్తాడు. అయితే పరిశుద్ధాత్ముడు దేవుని వాక్య అర్థాన్ని మనకు అందించడు. లేఖన భాగాల సందేశాన్ని భాషా సూత్రాలకు అనుగుణంగా అర్థం చేసుకునే అవసరతను పరిశుద్ధాత్ముడు భర్తీ చేయడు. మన ఆలోచనా విధానాన్ని నడిపిస్తాడు, అబద్ధపు బోధలు గుర్తించడానికి సాయపడతాడు (1 యోహాను 2:20,26,27). వాక్యానికి విధేయత చూపడానికి సాయపడతాడు.

పరిశుద్ధాత్మ దేవుడు వాక్యానికి కొత్త సందర్భాన్ని జోడించడు కాని ఆ భాగంలో ఇవ్వబడిన మూల అర్థాన్ని వెలికి తీయడానికి, అర్థం చేసుకొని, అన్వయించుకోవడానికి సాయపడతాడు.

## వాక్య అధ్యయనంపై ప్రస్తుత పోకడల ప్రభావం

ఆధునిక సంస్కృతి సాధారణంగా వేగవంతమైన ఫలితాలను, సులువైన వినోదాన్ని ఆశిస్తుంది. ఇది లోతైన వాక్య అధ్యయనానికి అవసరమైన క్రమశిక్షణ, ఉద్దేశపూర్వకమైన ప్రయత్నానికి అవరోధంగా ఉంది. సాంకేతిక పరిజ్ఞానం, పరికరాలు అందుబాటులోనికి వచ్చిన నాటినుంచి వాక్యం, దాని అధ్యయనం, సిద్ధపాటు పట్ల వైఖరి మారిపోయింది. సోషల్ మీడియాలో వెచ్చించిన సమయంలో కొంత శాతం సహితం వెచ్చించక, లేఖన భాగాల అధ్యయనాన్ని మన బిజీ జీవితంలో ఏదో మూలకు నెట్టివేస్తున్నాం. దేవుని వాక్యాన్ని దాని మూల సందర్భానికి అనుగుణంగా పరిపూర్ణ అవగాహన పొందకుండా ఇతరుల ప్రసంగాల వీడియోలు, ఏఐ, ఛాట్‌జిపిటిల సమాచారం నుంచి మన సందేశాలు, బైబిల్ స్టడీలు ఉద్భవిస్తున్నాయి. ఈజీ మనీ సంపాదనలా ఈజీ సందేశాలు, ఈజీ బైబిల్ స్టడీస్, ఈజీ సిద్ధాంతాలు, ఈజీగా దేవుని వాక్యానికి భావం చెప్పడం నేర్చుకున్నాం. మనం ఆలోచించకుండా, మన కోసం ఇతరులు ఆలోచించడానికి అలవాటు పడ్డాం. అధ్యయనం చేయకుండా ఆరంభంలోనే కామెంటరీలను ఆశ్రయించడం, ఇతరులు తయారు చేసిన "బైబిల్ రొట్టెను" తినడానికి ఎంతగానో అల వాటు పడిపోయాం.

ఒక బైబిల్ స్టడీ తీసుకోవాలన్నా, సందేశానికి సిద్ధపడాలన్నా భయం, ఆదుర్దాలు లేవు. త్రిత్వంలోని మూడవ వ్యక్తిని దేవుడు మనకు లేఖన భాగాల అధ్యయనానికి వెలిగింపు, నడిపింపు కోసం అనుగ్రహిస్తే ఆయనను పక్కన పెట్టి దైవత్వంలేని, మాట్లాడలేని, జీవం లేని సాధనాలతో దేవుని మనస్సు తెలుసుకోవాలని ప్రయత్నించడం ఎంత విషాదకరం! అవి వినియోగించకూడదనేది నా భావం కాదు. వాక్య అధ్యయనం కోసం వనరులు అవసరం. అదనపు సమాచారం అధ్యయనానికి మరింత అవగానను జోడిస్తుంది. కానీ కేవలం వాటి పైనే ఆధారపడి వాటి నుంచి దైవప్రేరిత సత్యాలను పొందాలనుకోవడం హాస్యాస్పదం.

ఇశ్రాయేలీయులకు 'పీపుల్ ఆఫ్ ది బుక్' అని పేరు. యుఇయఫ్ఐ వాక్య కేంద్రీకృతంగా జీవించాలనే గొప్ప మౌళిక విలువతో ఇప్పటి వరకు ఆధ్యాత్మిక ఉద్యమంగా దాని ఉనికిని కొనసాగించింది. దానిలో ముఖ్యంగా ఇండక్టివ్ బైబిల్ స్టడీ యుఇయఫ్ఐ హృదయ స్పందనగా, హాల్ మార్క్‌గా నిలిచిపోయింది. ఉద్యమానికి బలమైన లేఖన భాగాల గొప్ప పునాదిగా ఉండాలనే తాపత్రయంతో మన పితరుడు టియన్. స్టైరెట్ గారు 'హౌ టు స్టడీ యువర్ బైబిల్' అనే పుస్తకాన్ని అందించి, బోధించారు. తరువాత ఎన్నో వనరులు యుఇయఫ్ఐ ముద్రించి మనకు అందుబాటు లోనికి తెచ్చింది. ఇతర సంస్థలు పీపుల్ ఆఫ్ ది వర్డ్‌గా పరిగణించే మనం ఎంతగా మన వ్యక్తిగత, పరిచర్య జీవితాలలో దానిని వాస్తవం చేస్తున్నాం అనేది ప్రస్తుత ప్రశ్న?

– **బి.మంజుల లాజరస్,** మాజీ నేషనల్ స్టాఫ్, యుఇయఫ్ఐ



ప్రత్యేకం

# ఆయన అడుగుజాడల్ని అనుకరిద్దాం

ఒక ఒరిజినల్ డయాగ్రమ్‌ని ఉన్నది ఉన్నట్లు రాబట్టాలంటే దాని కింద కార్బన్ పేపర్ పెట్టి మరో పేపర్‌ని దాని కింద పెట్టి ఒరిజినల్ డయాగ్రమ్ గీత వెంబడి గీస్తూ పోతే కింది పేపర్ మీద అచ్చం ఒరిజినల్ డయాగ్రమ్ లాంటిది పొందవచ్చు. ఇమిటేషన్ అంటే ఏంటో అర్థం చేసుకోవడానికి ఈ ఉదాహరణ ఉపయోగపడుతుంది. పిల్లలు తమ తల్లిదండ్రుల మాటలను, హావభావాలను, చేతలను గమనించి అనుకరించడానికి ప్రయత్నిస్తారు. ప్రారంభంలో తప్పటడుగులు పడతాయి. ఎదుగుతున్న కొద్దీ పరిపూర్ణతకు దగ్గరవుతారు. స్పైకాన్-2026 థీమ్ పేతురు పత్రిక లోనిది కాబట్టి పేతురు జీవితాన్ని పరిశీలిస్తే అతడు క్రీస్తు అడుగు జాడలను అనుకరించే క్రమంలో ఆరంభంలో దేవుని సంగతులను మనుషుల సంగతులుగా పరిగణించి ఎలా తప్పటడుగులు వేశాడు? పరిశుద్ధాత్మ అనుగ్రహింపు, నడిపింపును బట్టి ఒకటి రెండు సందర్భాలలో తప్ప మిగతా జీవిత కాలమంతా క్రీస్తు అడుగు జాడలను తూచ తప్పకుండా ఎలా అనుకరించాడు? హింసలకు గురి అవుతున్న ఆనాటి విశ్వాసులను ఎలా ప్రేరేపించాడు?అనే విషయాలు మనకు స్పష్టమవుతాయి.తప్పటడుగులు వేసే దశలో అతడు ప్రభువుతో “నన్ను విడిచి పొమ్ము నేను పాపాత్ముడను (లూకా 5:8)” అని కూడా అంటాడు. అతడు వేసిన తప్పటడుగులు ఏంటో నిఖార్సయిన అడుగులు ఏంటో పోల్చిచూద్దాం.

## మనుష్యుల విషయాలు (అపవిత్రమైనవి) - దేవుని విషయాలు (పవిత్రమైనవి)

### 1. సున్నితత్వం లేకపోవడం - సున్నితత్వం

మానవాళి రక్షణ కొరకు తాను శ్రమపడి సిలువలో చనిపోయి తిరిగి లేవాల్సి ఉందని ప్రభువు బోధిస్తుంటే సాతాను ప్రేరేపణను గుర్తించక సిలువ మరణం నీకు దూరమగు గాక అని పేతురు ఏకంగా ఆయన చేయి పట్టుకుని గద్దిస్తాడు. ప్రజల రక్షణకు అభ్యంతర కారణంగా వ్యవహరిస్తాడు. ప్రభువు “సాతానా నా వెనుకకు పొమ్ము నీవు దేవుని సంగతులను తలంచక ఉన్నావు” అని గద్దిస్తాడు (మత్తయి16:21-23).

క్షేత్రస్థాయిలో విద్యార్థుల రక్షణ కొరకు పాటుపడకుండా ఉండడం మూలంగా గాని, పరిచర్య పద్ధతి ప్రకారం చేయకపోవడం మూలంగా గాని దేవుని ప్రణాళికను అడ్డుకుంటున్నావేమో! వివాహ విషయంలో కూడా దేవుని చిత్తాన్ని అడ్డుకుంటున్నావేమో! ఇలాంటివి సాతాను కుతంత్రాలు.

ఇదే పేతురు అపో.కా. 5వ అధ్యాయంలో అననీయ, సప్పీరా అనే దంపతులు సాతాను ఉచ్చులో పడి ఏకంగా దేవునితోనే అబద్ధమాడుతూ పరిశుద్ధాత్మనే మోసగించడానికి ప్రయత్నించినప్పుడు చాలా జాగ్రత్తగా, సున్నితత్వంతో సాతాను కుతంత్రాన్ని ఎండగడతాడు.

### 2. ఆత్మవిశ్వాసం-క్రీస్తుపై విశ్వాసం

తాను మరణించడానికి ముందు రోజు ప్రభువు గెత్సేమనే తోటలో తండ్రి చిత్తం నెరవేర్చడం



ఢాంబికాలకు పోయిన పేతురు తర్వాతి కాలంలో క్రీస్తు వలె తన్ను తాను బహుగా తగ్గించుకుంటాడు. ఎంతగా తగ్గించుకుంటాడు అంటే నేను క్రీస్తుకు దాసుణ్ణి అని, సువార్త వ్యతిరేకులు అతడిని సిలువ వేయడానికి ప్రయత్నించినప్పుడు "నన్ను నా ప్రభువుతో సమానంగా ఎంచవద్దు. నన్ను తలకిందులుగా సిలువ వేయండి" అని బ్రతిమలాడతాడు. తన పత్రిక చదివే వారిని కూడా ఇలానే దీన మనస్సు అను వస్త్రము ధరించుకొనుడి, ఆయన హెచ్చించేదాకా ఆగండి, మీకు మీరే హెచ్చించుకోకండి అని కూడా హెచ్చరిస్తాడు (1 పేతురు 5:5,6).

కోసం ప్రార్థనలో సిద్ధపడుతూ ఉండే సమయంలో బంట్రౌతులు దొమ్మిగా వచ్చి ఆయనను పట్టుకో బోతుండగా పేతురు తన స్వశక్తితో ప్రభువును రక్షించగోరి బొంట్రోతు చెవి తెగ నరుకుతాడు. అంటే క్రీస్తుపై ఆధారపడకుండా తానే చేయగలను అనే తత్వం. ప్రభువు అతడిని గద్దిస్తాడు (యోహాను 18:10).

నేనే సమర్థుడను, నా వల్లనే, అని అతిశయించడం ఉందేమో!

ఇదే పేతురు పుట్టింది మొదలుకొని కుంటివాడైన ఒక మనుష్యుని అద్భుతంగా స్వస్థపరచినప్పుడు అధికారులు అడుగగా 'మా శక్తితో కాదు క్రీస్తునామమందలి శక్తి చేతనే మేము చేయగలిగాము' అని యథార్థంగా చెప్తాడు. అంటే క్రీస్తుపై ఆధారపడ్డాడు.

### 3. లోక సంబంధమైనవి-పరలోక సంబంధమైనవి

రూపాంతర కొండమీద మహిమాన్వితుడైన ప్రభువును, మోషే, ఏలియాలను చూచి "మనమిక్కడ ఉండుట మంచిది నీకు ఇష్టమైతే మీ ముగ్గురికి మూడు పర్ణశాలలు కట్టేస్తాను" అంటాడు పేతురు. ( మత్తయి17:4,5). మరోచోట "మేము సమస్తము విడిచిపెట్టి వచ్చాము. వీటి బదులు మాకు ఇంకా ఏమి దొరుకుతుంది" అంటాడు. అంటే ఈ లోకమే, ఈ శరీరమే శాశ్వతం అనే భావన పేతురుది.

కొంతమందిని మెటీరియలిజం పట్టి పీడిస్తుంటుంది. పేతురు తర్వాత దినాలలో ఈ భౌతిక వాదం నుండి బయటపడి పరలోక వాదం బాట పడతాడు. ఇతరులను ఈ విధంగా ప్రేరేపిస్తాడు. "ఈ లోకం, ఈ దేహం శాశ్వతం కాదు. ఈ లోకంలో మనం పరదేశులం, యాత్రికులం గనుక ఏదో ఒక దినాన ఈ లోకాన్ని, ఈ దేహాన్ని విడిచిపెట్టి పరలోకానికి వెళ్ళవలసి ఉంటుంది" (1 పేతురు 2:11; 2 పేతురు 1:14,15)

### 4. గర్వం-వినయం

ప్రభువు శిష్యుల బలహీనతలు ఎరిగినవాడై "గొర్రెల కాపరిని కొడతారు. గొర్రెలు చెదరి పోతాయి" అని "నన్ను ఎరుగనని ముమ్మారు బొంకుతావు" అని జరగబోయేది చెప్తుంటే "ఎవరు అభ్యంతర పడినా నేను అభ్యంతర పడను, నీతో పాటు చావాల్సి వచ్చినా నిన్ను ఎరుగనని బొంకను" అని ఢాంబికాలు పలుకుతాడు. తర్వాత ఏం జరిగిందో మనకు తెలుసు.

మన ఆత్మీయ స్థితి ఏంటో, మనం ఎంతవరకు పరిచర్య చేశామో అంతవరకు కనబడితే చాలు, వినబడితే చాలు. అంతకంటే ఎక్కువగా అందరి దృష్టిలో పడాలని అన్నిట్లో తలదూరుస్తూ విపరీతంగా హెచ్చులకు పోతుంటే అది డాంబికం, అతిశయం, గర్వం. ఈ నైజం ముదిరితే మానసిక రోగానికి గురవుతాము. కొంతమంది దేవుని పేరు మాటున తమ్మును తాము హెచ్చించుకొంటుంటారు. "ప్రభువు నందు అతిశయిద్దాము"(2 కొరింథీ 10:17).

ధాంబికాలకు పోయిన పేతురు తర్వాతి కాలంలో క్రీస్తు వలె తన్ను తాను బహుగా తగ్గించుకుంటాడు. ఎంతగా తగ్గించుకుంటాడు అంటే నేను క్రీస్తుకు దాసుణ్ణి అని, సువార్త వ్యతిరేకులు అతడిని సిలువ వేయడానికి ప్రయత్నించినప్పుడు "నన్ను నా ప్రభువుతో సమానంగా ఎంచవద్దు. నన్ను తలకిందులుగా సిలువ వేయండి" అని బ్రతిమలాడతాడు. తన పత్రిక చదివే వారిని కూడా ఇలానే దీన మనస్సు అను వస్త్రము ధరించుకొనుడి, ఆయన హెచ్చించేదాకా ఆగండి, మీకు మీరే హెచ్చించుకోకండి అని కూడా హెచ్చరిస్తాడు (1 పేతురు 5:5,6).

### 5. పక్షపాతం-నిష్పక్షపాతం

దేవుని సార్వత్రిక రక్షణ ప్రణాళిక అర్థం గాక యేసు యూదులకు మాత్రమే రక్షకుడని, రక్షణ యూదులకు మాత్రమేననే భావనతో అన్యులకు సువార్త చెప్పనే చెప్పడు. వాళ్ళు నిషేధింపబడిన వారని, తక్కువ జాతి వాళ్ళని పక్షపాత వైఖరి ప్రదర్శిస్తాడు. దేవుడు పవిత్రం చేసిన వాటిని నీవు నిషిద్ధమైన వాటిగా ఎంచవద్దని మూడుసార్లు దేవుడు మాట్లాడగా అతడు కళ్ళు తెరచి అన్యుడైన కొర్నేలి ఇంటికి వెళ్ళి సువార్త చెప్తాడు. ఆ ఇంటి వారంతా రక్షణ పొందుతారు. అప్పుడు అతడు అన్నమాట "దేవుడు పక్షపాతి కాడు అని నిజముగా గ్రహించియున్నాను" (అ కా 10: 28, 34)

సహవాసంలో పెద్ద ఉద్యోగులు- చిన్న ఉద్యోగులు, డబ్బున్న వాళ్ళు - పేదవాళ్ళు, మనవాడు - తమ వాడు, గ్రాడ్యుయేట్స్-స్టాఫ్-స్టూడెంట్స్ అనే రకరకాల తారతమ్యాలు ఉన్నాయేమో పరిశీలించుకుందాం.

### 6. మనుష్యులను సంతోషపెట్టడం - దేవుణ్ణి సంతోషపెట్టడం

పరిశుద్ధాత్మ అనుగ్రహింపబడిన తర్వాత కూడా పేతురు ఒక విషయంలో తప్పటడుగులు వేస్తాడు. ఒకసారి సున్నతి పొందని అన్యులైన విశ్వాసులతో కలసి భోజనం చేస్తుండగా యెరూషలేము నుండి కొంతమంది సున్నతి పొందిన యూదా క్రైస్తవులు అక్కడికి వచ్చినప్పుడు వారికి భయపడి వేరైపోతాడు. అది వేషధారణ అని పౌలు అందరి ఎదుట పేతురును గద్దిస్తాడు(గలతీ 2:11-14). అంటే వాళ్ళను సంతోషపరచడానికి, మెప్పు పొందడానికి వాళ్ళతో సై అన్నాడు. వీళ్ళు వచ్చాక వీళ్ళ దృష్టిలో చెడు అవ్వకుండా ఉండడానికి ప్రయత్నించాడు.

ఇలాంటి ద్వంద్వ ప్రమాణాలు, ఏ ఎండకా గొడుగు పట్టే నైజం మనలో ఉందేమో పరిశీలించుకుందాం. "ప్రభువు మెచ్చుకునేవాడే యోగ్యుడు" 2 కొరింథీ 10:18

పైన పేర్కొన్న సబ్‌హెడ్డింగ్స్‌లో మొదటి అంశాలన్నీ మనుషుల సంగతులు, సాతాను ప్రేరేపితం కాబట్టి అవన్నీ అపవిత్రత జాబితాలోకి వస్తాయి. రెండవ అంశాలన్నీ దేవుని సంగతులు, పరిశుద్ధాత్మ ప్రేరేపితం కాబట్టి అవన్నీ పవిత్రత జాబితాలోకి వస్తాయి. ఈ అడుగు జాడల్ని మనం అనుసరించాలి.

### ముగింపు

నీరో చక్రవర్తి పరిపాలన కాలంలో క్రైస్తవుల సంఖ్య అపరిమితంగా విస్తరించబడుతుంది. అతని కాలంలోనే రోమా పట్టణం ఏదో కారణం చేత తగలబడుతుంది. దానికి కారణం క్రైస్తవులే అని చక్రవర్తి భ్రమపడి క్రైస్తవులను తీవ్రంగా హింసిస్తాడు. అనేకమంది ప్రాణాలు కోల్పోతారు. తప్పించుకున్న వారు రోమా విడిచి ఇతర ప్రాంతాలకు చెదరిపోతారు (1 పేతురు1:1-2). మన కాన్ఫరెన్స్ థీమ్ 'సమర్పించుకోవడం, అనుకరించడం, ప్రేరేపించడం' 1 పేతురు 2:21-22 నుండి తీసుకొన్నదే. క్రీస్తును అంగీకరించినందుకును, రక్షణ సువార్తను ప్రకటిస్తున్నందుకును ఎదురయ్యే శ్రమలను, బాధలను సహించడంలో క్రీస్తు అడుగుజాడలను అనుకరించండి. ఇందుకే మీరు పిలువబడ్డారు (వ 20) అని చెబుతాడు.

గనుక మనం అన్నివిషయాల్లో పరిశుద్ధంగా జీవిస్తూ క్రీస్తు అడుగుజాడలను అనుకరించి మన తర్వాతి తరం వారికి మాదిరిగా ఉందాం. అంతేకాదు సువార్త ప్రకటించే ప్రక్రియలో ఎదురయ్యే శ్రమలు, బాధలు సహించడంలో కూడా క్రీస్తు అడుగుజాడలను జ్ఞానముతో, ధైర్యముతో అనుకరించి వారికి మాదిరి ఉంచుదాం. మన శరీరాలు తాత్కాలికం. మన ఆత్మలే శాశ్వతం. మన ఆత్మలను మన కాపరి తన చేతులలో పదిలంగా భద్రపరిచాడు. అంతేకాదు ఆయన అడుగుజాడలను మనం ఎలా అనుకరిస్తున్నాము అని అధ్యక్షుడు వలె మనలను పరలోకం నుండి గమనిస్తున్నాడు (1 పేతురు 2:25). గనుక పరిశుద్ధతలోను, పరిచర్యలోను క్రీస్తు వలే తండ్రికి లోబడుదాం.

- యస్. డేవిడ్ లివింగ్‌స్టోన్, జంగారెడ్డిగూడెం




# స్పైకాన్ డైరీ...

ఉదయం 8 గంటలు, శనివారం...

అభిషేక్‌కి నిద్ర లేవడం చాలా కష్టంతో పాటు ఆలస్యం అయ్యింది. స్పైకాన్, అమలాపురం నుండి వచ్చేసరికి చాలా లేట్ అయ్యింది. ఆ రోజు కూడా సెలవు కావడంతో త్వరగా నిద్రలేవాలనిపించలేదు. క్వైట్‌టైమ్ ముగించుకొని, ఫోన్ చూస్తుండగా "వచ్చేవారం ఇజియఫ్ మీటింగ్‌లో, స్పైకాన్‌లో నేర్చుకున్న విషయాలను గురించి షేరింగ్ ఉంటుంది, అందరూ తప్పకుండా సిద్ధపడి కుటుంబాలతో రావాలి' అని మెసేజ్ చూడగానే, అభిషేక్ మనస్సు ఆలోచనలతో నిండిపోయింది.

ఇదిగో... టీ, తాగండి అంటూ కొంచెం కటువుగా వినిపించిన తన భార్య మాటలతో ఈ లోకంలోకి వచ్చాడు.

అభిషేక్‌కి, తన భార్యకి గత కొన్ని రోజులుగా సంతోషం లేదు, సమాధానం లేదు. ఏదో ఒక సమస్యతో సతమతమవుతూ, అపార్థం చేసుకొంటూ, అనరాని మాటలు అనుకొంటూ, అనర్థాలు తెచ్చుకుంటున్నారు. చిన్న చిన్న విషయాలకే చిరాకు పడుతున్నారు. చిరాకు కాస్తా గాలి వానలా మారుతుంది.

ప్రభుదాసు అన్న కుటుంబ ప్రోత్సాహంతో, కుటుంబంగా స్పైకాన్‌కు వెళ్ళారు. భార్యాభర్తలకు విడివిడిగా వసతి ఏర్పాట్లు, పిల్లలిద్దరిని అమ్మమ్మ ఇంట్లో ఉంచి అమలాపురం వెళ్ళారు.

స్పైకాన్‌లో ఉన్నన్ని రోజులన్నీ సమస్యలున్నట్లు బయట పడకుండా, సమాధానాన్ని, సంతోషాన్ని నటిస్తూ, సప్త స్వరాలలో కుటుంబం ఉందని అందరికి చూపిస్తూ, ఇతరుల మెచ్చుకోలు మాటలతో, పలకరింపులతో పులకించి పోయేవారు. ఒకరికొకరు లోలోపల దూరంగా ఉన్నప్పటికి పైకి బాగానే కలిసి నవ్వుతుండేవారు. అలా స్పైకాన్ ముగించుకొని, ఇంటికి వచ్చారు.

అభిషేక్ కన్నులు తన భార్య, స్పైకాన్‌లో వాక్యం చెబుతున్నప్పుడు రాసుకున్న డైరి కోసం వెదకసాగాయి. తన మనస్సునిండా డైరీలో ఏముందనే ఆతృతతో వెదుకుతున్నప్పుడు ఆ డైరీ తన చేతికి చిక్కింది.

తన భార్య వంట గదిలో చాలా బిజీగా ఉంది. ఆ డైరీ తీసుకొని తన రూమ్ లోనికి వెళ్ళి తీసి చదవసాగాడు. కొన్ని మాటలను హైలైట్ చేస్తూ ఇలా రాసుకుంది.

1. ద్వేషించే లోకంలో దేవుని ప్రజలు ఎలా జీవించాలి?

   ఎ. ఎన్నుకోబడిన పరదేశులము, బి. ఎన్నుకున్న క్రీస్తును వెంబండించాలి, సి. ఎన్నదగిన క్రీస్తు మీద నిరీక్షణతో ప్రోత్సహించుకోవాలి.

2. ఈ రోజు చేసే పని నిత్యత్వానికి ఉపయోగ పడుతుందా?
3. ఆజ్ఞ ఆశగా మారితే... ఆయనను అనుక రించడం అలవాటుగా మారుతుంది.
4. నేను (మనము) ముత్యం, నేను అమూల్యమైన రక్తంతో కొనబడ్డాను (ఈ మాట క్రింద చాలా చిన్నగా – ఈ సంగతి నా భర్తకు అర్థం కాలేదు, అందుకే అనరాని మాటలు అంటున్నాడు).
5. మించిన కోపం, మించిన కామం దుష్టుని నుండే వస్తాయి (క్రింద చిన్నగా – అవును, మా ఆయన దుష్టుని సంబంధిలా జీవిస్తున్నాడు).
6. జీవితంలో గాయాలు లేవా? మచ్చలు లేవా? (ఉన్నవి.. నా భర్త మానసికంగా చేసిన గాయాలు, మాటల తూటాల మచ్చలు).
7. కొంత మంది భార్యలకి, భర్తలంటే హడల్.
8. కొంత మంది భార్యలను భర్తలు కొడుతున్నారు. (అవును... నన్ను కొట్టాడు).
9. వివాహం విమోచనలో భాగం.. లోబడుదాం (నిజమే ... నేను నా భర్తకు లోబడడం లేదు).
10. ఏది ఏమైనా నా భర్త ముత్యం. అలాంటి ముత్యానికి ముచ్చెమటలు పట్టించాను.

చాలా పెద్ద అక్షరాలతో.. "నన్ను క్షమించు ప్రభూ, నా భర్త నాయకత్వానికి లోబడతాను, ఆయన నాయకత్వాన్ని ఆస్వాదిస్తాను. నన్ను నేను ప్రతిష్ఠించుకొంటున్నాను. మీ మాదిరినే నేను అనుసరి స్తాను. సహాయం చేయండి" అని రాసుకొంది.

ఇలా చదువుతున్న అభిషేక్‌కి హృదయమంతా పిండేసినట్లుంది. కన్నీళ్ళు ఆగడం లేదు, కన్నీళ్ళు తుడుచుకుంటూనే పేజీలు తిరగేస్తూ మనసులో ఇలా ప్రార్థన చేశాడు "ప్రభూ పశ్చాత్తాపంతో మీ పాదాలు పట్టుకుంటున్నాను, వేషధారిలా జీవిస్తున్నాను, నన్ను క్షమించండి" భార్యను ప్రేమించే విషయంలో అహానికి పోతూ అధికారం చెలాయిస్తున్నాను. మా కుటుంబంలో మీరిచ్చే శాంతి, సంతోషం, సమాధానాలు లేకపోవడానికి కారణం నేనే ప్రభువా, నా పాపాన్నుండి నన్ను కడగండి. భార్యను ప్రేమించే విషయంలో నన్ను నేను ప్రతిష్ఠించుకొంటున్నాను. మీరు సంఘాన్ని ప్రేమించినట్లు నా భార్యను ప్రేమించే మనసు నాకివ్వండి" అంటూ ప్రార్థించాడు.

అభిషేక్ ఇలా చదువుతూ ప్రార్థిస్తూ ఉండగా భార్య ఆ రూమ్‌లోకి ఎప్పుడు వచ్చిందో తెలీదు. తనను చూసి మొదట కంగారుపడ్డాడు. కానీ ఏడుస్తున్న తన భార్యను చూసి చలించిపోయాడు.

భార్య భర్తలిద్దరూ ఏడుస్తూ ఒకరి పాపాల్ని ఒకరు దేవుని సన్నిధిలో ఒప్పుకొంటూ పశ్చాత్తాపంతో ప్రార్థన చేసుకున్నారు. సమాధానం, సంతోషం గుండెల నిండా పరవళ్ళు తొక్కుతున్నాయి. హృదయమార క్షమాపణలతో సమాధానాన్ని వెంటాడి ప్రార్థన ముగించారు.

అప్పటికే వేడి వేడి భోజనం చికెన్‌తో, సాంబార్‌తో రెడీగా ఉంది. అభిషేక్ అలా సంతోషాన్ని అనుభవించి కొన్ని నెలలు అయ్యింది.

ఆ రోజు సాయంత్రం 4 గం॥లకు అభిషేక్ కూడా తన స్పైకాన్ డైరీ తీసి అందులో తాను రాసుకున్న విషయాలు చదవసాగాడు.

1. బాధ్యతను ప్రేమతో స్వీకరించినప్పుడే సేవలో ఆనందం,వస్తుంది.
2. మనము దేవాది దేవునితో జతపనివారము.
3. చాలా మంది సైనికులుగా ఉండాల్సిన వారు, ప్రేక్షకులుగా ఉన్నారు.
4. చాలా మంది పొలంలో పని చేయాల్సినవారు, పొలాన్ని పాడు చేస్తున్నారు.
5. గొప్ప దేవుడు, గొప్ప పనిని, గొప్పవారము కాని మనల్ని గొప్పగా ఎంచి, పనిని అప్పగిస్తే.. పని సంగతేంటి? పరిచర్య సంగతేంటి?

ఈ మాటలు చదువుతున్న అభిషేక్‌కి తన మైక్రోప్రేయర్ సెల్ (యంపిసి) స్టూడెంట్స్ గుర్తుకు వచ్చారు. వారిని కలిసి, మాట్లాడి, వారిని పట్టించుకొని కొన్ని నెలలు అయ్యింది. వెంటనే స్పైకాన్‌కి వచ్చిన తన యంపిసి స్టూడెంట్ అఖిల్‌కి ఫోన్ చేసి సాయంత్రం భోజనానికి ఇంటికి రా అని ఆహ్వానం అందించాడు. తను చేయని పరిచర్య అంతా గుర్తుకు వచ్చి మరలా పశ్చాత్తాపంతో ప్రభువుని క్షమాపణ కోరాడు.

మరో రెండు రోజులలో కాలేజీ తెరుస్తారు కదా అని అఖిల్ కూడా ఒకరోజు సెలవుకి ఇంటికి వెళ్ళకుండా రూమ్‌కి వచ్చేసాడు. అభిషేక్ అన్న ఆహ్వానాన్ని అందుకున్న అఖిల్, అరగంట ముందే

అభిషేక్ అన్న ఇంటికి చేరుకున్నాడు. అఖిల్‌కి చాలా సిగ్గు అనిపించింది. అన్న చాలా సార్లు ఇంటికి పిలిచినా వెళ్ళలేక పోయినందుకు.

అభిషేక్, అఖిల్ ఇద్దరూ కూర్చుని స్పైకాన్ విషయాలు పంచుకొన్నారు. అఖిల్ ఏమి నేర్చుకున్నావు? ఏ నిర్ణయాలు తీసుకున్నావ్? అని అడిగేసరికి అఖిల్ కొంచెం కంగారుపడ్డాడు. “ఫర్వాలేదులే చెప్పు ఆ నిర్ణయాలు నీ జీవితంలో నెరవేరేటట్లు కలిసి ప్రార్థన చేద్దాం అని అన్న ప్రేమతో అడిగేసరికి ధైర్యం తెచ్చుకొని చెప్పడం ప్రారంభించాడు.

ఫోన్‌లో పాపపు సంబంధమైనవి చూడకూడదని, పర్సనల్ లైఫ్, ప్రైవేట్ లైఫ్ అంటూ విభజించకూడదని తీర్మానించుకొన్నాను.

మంచిది తమ్ముడూ...

అన్నా దయచేసి ఏమనుకోనంటే...

ఏమనుకోను తమ్ముడు చెప్పు ఏంటి...?

అన్నా, సీక్రెట్‌గా ఒక అమ్మాయిని ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలోఅవుతున్నాను. ప్రేమిస్తున్నాను. పోర్నోగ్రఫీని ప్రోత్సహించే వాటిని నా మొబైల్‌లో ఉంచాను. దేవుడు నాతో పరిశుద్ధత గురించి మాట్లాడిన తర్వాత ఆ అమ్మాయిని విడిచిపెట్టాలని, అసభ్యకరమైనవి నా మొబైల్ నుంచి తీసివేయాలని నిర్ణయించుకొని తీసేసాను.

ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ని, బైబిల్ ఇంటిలిజెన్స్‌తో భర్తీచేయాలని, నా మనస్సును, హృదయాన్ని వాక్యంతో నింపుకొని నిత్యత్వపు వెలుగులో జీవించాలని, అమూల్యమైన రక్తంతో కొనబడిన నేను ఆయన వలె, ఆయన అడుగుజాడల్లో నడవాలని నిర్ణయించుకొన్నాను.

ఈ మాటలు వింటున్న అభిషేక్ మనసులో పాత జ్ఞాపకాలు మెదులుతున్నాయి. తాను విద్యార్థిగా ఉన్నప్పుడు పోర్నోగ్రఫీ దగ్గర పడిపోయిన సందర్భాలు, దేవుడు తనను వాటి నుంచి ఎలా బయటకు తీసువచ్చాడో జ్ఞాపకం వచ్చి దేవునికి వందనాలు తెలియజేశాడు.

అభిషేక్, అఖిల్ ఇద్దరూ కలిసి కొంతసేపు ప్రార్థన చేసుకొన్నారు. స్పైకాన్‌లో వారు తీసుకొన్న నిర్ణయాలకు కట్టుబడి ఉండేటట్లు సహాయం చేయమని దేవునికి ప్రార్థన చేశారు.

కొద్ది సేపటికి భోజనం సిద్ధమైంది, భోజనం చేస్తుండగా బైబిల్ స్టడీస్ గురించి, ప్రేయర్ సెల్స్ గురించి, ఔట్‌రీచ్ పరిచర్య గురించి చాలా విషయాలు ప్రస్తావనకి వచ్చాయి.

భోజనం ముగించుకొని వెళ్ళబోతూ అఖిల్ అన్నతో “అన్నా రేపు ఔటీరీచ్ కాలేజీకి వెళ్ళి ప్రార్థన చేసి వద్దామా? చాలా రోజులైంది కదా!

తప్పకుండా వెళ్దాం అని అభిషేక్ చెప్పేసరికి, అఖిల్ వెళ్ళిపోయాడు.

అభిషేక్‌కి ఆ రోజు చాలా తృప్తిగా అనిపించింది. చాలా సంతోషంతో ఫ్యామిలీ ప్రేయర్‌తో నిద్రకు ఉపక్రమించారు.

మరుసటి రోజు ఆదివారం ఉదయాన్నే లేచి, క్వైట్‌టైమ్ ముగించుకొని టీ తాగుతుండగా తన భార్య, తన బైబిల్ స్టడీకి వచ్చే పిల్లలతో ఫోన్‌లో మాట్లాడుతుంది. ఆగిపోయిన బైబిల్ స్టడీని మరలా ప్రారంభించాలనే ఆలోచన చేయడం అభిషేక్‌కి ఆశ్చర్యంగా, సంతోషంగా అనిపించింది. ఇద్దరూ సిద్ధపడి సమయానికి ఆరాధనకు సంఘానికి వెళ్ళారు.

మూడు రోజుల తర్వాత ఇజియఫ్‌లో షేరింగ్ జరిగింది. అందరూ దేవుడు తమతో మాట్లాడిన విషయాలు చెప్పారు. అభిషేక్, వాళ్ళ భార్య కూడా షేర్ చేశారు. ముగింపులో ఇజియఫ్ సెక్రటరీ రమేష్ లేచి “మనం స్పైకాన్స్‌కు వెళ్ళడం, నేర్చుకోవడం, నిర్ణయాలు తీసుకోవడం కొత్తకాదు. అయితే, వాటిని ఖచ్చితంగా అమలు చేద్దాం.

మనల్ని, మన సమయాన్ని, తలాంతులను, సంపదను, టెక్నాలజీని..అన్నిటిని ప్రభుకోసం ప్రతిష్టించుకొని, ప్రభువు మహిమకై వాడదాం. శ్రమల్లో క్రీస్తు ప్రభువు మాదిరిని, ఆయన దీనత్వాన్ని, సాత్వికాన్ని అనుసరిద్దాం. నిరీక్షణ కలిగి పరిచర్యలో ఒకరినొకరం ప్రోత్సహించుకొందాం” అని ముగించాడు. చివరి ప్రార్థనలో అందరూ పశ్చాత్తాపంతో, కన్నీటి ప్రార్థనతో మరలా తమ్మును దేవునికి సమర్పించుకొన్నారు. ప్రార్థన తర్వాత డిన్నర్‌తో ఇజియఫ్ ముగిసింది.

**– యం. గాలెయ్య,** భీమవరం




కథానిక

# కృతజ్ఞతకు అసలు కారణం

ఎయిర్ పోర్ట్‌లో...

అదిగో గోల్డీ వచ్చేస్తుంది అన్నాడు హానోక్. తనను చూసిన పేరెంట్స్...

హమ్మయ్య, అబ్రాడ్ నుండి క్షేమంగా వచ్చిందని లోలోనే దేవునికి థ్యాంక్స్ చెప్పారు.

ఎలా ఉన్నావ్? హౌ ఈజ్ లైఫ్? కొంచెం రంగొచ్చావ్, సన్నబడ్డావ్...ఇవన్నీ పలకరింపుల్లో భాగాలయ్యాయి. ఆలింగనాలు, ముద్దులు, నవ్వులు, షేక్‌హ్యాండ్స్....

మీరంతా రిస్క్ తీసుకొన్నారు... అని గోల్డీ డాడీని, మమ్మీని ఉద్దేశించి అంది.

ఫర్వాలేదులే, ఏమవుతుంది అని రిప్లై ఇచ్చారు. కాస్త రిఫ్రెష్ అయి మచిలీపట్నానికి బయలుదేరారు. వచ్చేటప్పటికి సాయంత్రమైంది. డాడీ ప్రార్థనలో దేవునికి కృతజ్ఞతలు చెప్పారు.

కొంచెం సేపటికి తను తెచ్చిన గిఫ్ట్లను ఓపెన్ చేసి ఇది డాడీకి, ఇది మమ్మీకి, ఇది తమ్ముడికి అని అందిస్తుంటే... బాగుంది, చాలా బాగున్నాయ్ అనే ప్రశంసలకు 'హమ్మయ్య' అనుకుంది గోల్డీ.

పేరెంట్స్ మాత్రం, ఇవన్నీ మాకవసరమా? నీవు క్షేమంగా ఉండడమే బిగ్ గిఫ్ట్.

మంచి సెలక్షన్స్ అని డాడీ మెచ్చుకొంటే, దానికి తెలియదేంటీ అని గోల్డీని వెనకేసుకొచ్చింది మమ్మీ.

సరే ఫ్యామిలీ ప్రేయర్‌కు టైం అయ్యింది, అసలే అలసిపోయింది అన్నాడు డాడీ. ఫ్యామిలీ ప్రేయర్‌లో గోల్డీ పాడడం, బైబిల్ చదవడం చూడ ముచ్చటగా ఉంది. ప్రార్థన చేస్తావా అని డాడీ అడిగిన వెంటనే ప్రార్థన చేయడం చూస్తుంటే తను దేవునికి ఎంత సన్నిహితంగా ఉందో అర్థమైంది.

పిల్లలు వారి బెడ్స్‌కి వెళ్ళగా, తల్లిదండ్రులు మాత్రం రేపటి బ్రేక్‌ఫాస్ట్ గురించి ఆలోచిస్తున్నారు. ఆమెకు ఏది ఇష్టమోనని. తల్లి ఇడ్లీ, గారె, పూరీ అంటుంటే, ఆరోగ్యకరమైనవి కూడా ఆలోచించు అన్నారు.

బ్రేక్‌ఫాస్ట్ ఏర్పాట్లు అయిన తర్వాత గోల్డీ అలసిపోయి, పడుకొని ఉంటుందని మమ్మీ చూడడానికి వెళ్తే, గోల్డీ మోకాళ్ళమీద ఉండి ప్రార్థన చేసుకొంటుంది. పాపని డిస్టర్బ్ చేయకూడదని మరికొంత సమయం తర్వాత వెళ్ళి చూస్తే ఇంకా ప్రార్థనలోనే ఉంది. పాపకు ప్రార్థనా సమయం పెరిగిందని మమ్మీ అనుకొంది.

ఉదయాన్నే ఇంకా లేచిందో, లేదో అనుకొంటూ పాప దగ్గరికి వెళ్ళగా బైబిల్ చదువుతూ నోట్స్ రాసుకొంటూ ఉంది. డిస్టర్బ్ చేయడం ఇష్టంలేక మమ్మీ వంట గదిలోకి వెళ్ళింది.

'తమ్ముడూ! ఇంకా లేవలేదా? ఇదిగో బ్రష్ వాష్ చేసికొని, క్వైట్‌టైమ్ చేసుకో' అన్న అక్కని చూచి నీ క్వైట్‌టైమ్ అయిపోయిందా? అన్నాడు. ఆ... ఎప్పుడో.. హానోక్‌కి ఆశ్చర్యమేసింది.

రండి! రండి! టిఫిన్ వేడివేడిగా ఉంది అని మమ్మీ పిలుస్తుంది.

అక్కా! నీ కిష్టమని మమ్మీ... అని హానోక్ అంటుండగా... సర్లే, నీకొక మంచి పుస్తకం తెచ్చాను. ఇదిగో అంటూ 'నూతన సృష్టి' అనే పుస్తకాన్ని తమ్ముడికి గోల్డీ ఇచ్చింది. ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి, పాతవి గతించెను, సమస్తమును కొత్తవాయెను (2 కొరింథీ 5:17). అసలు నూతన సృష్టి అనేది దేవుని పరిపూర్ణ ప్రణాళిక. అది క్రీస్తు సిలువ, మరణ, పునరుత్థానాలకు ముడిపడి ఉంది. న్యూ క్రియేషన్ అనే దానిని ఎకనామిక్ ప్రాస్పరిటీకి, మంచి హెల్త్‌కి ముడిపెట్టి చూడడం, ప్రకటించడం నాకు చాలా బాధ కలిగించేవి. అయినా మనం క్రీస్తులో నూతన సృష్టిగా చేయబడినందుకు ఆనందిస్తూ కృతజ్ఞత కలిగిన వారిగా ఉండాలి. గలతీ 2:20 చదువు. అది పౌలుకున్న అవగాహన. ప్రకటన 3:14లో యేసుక్రీస్తు దేవుని సృష్టికి ఆదియునైయున్నాడు. నూతన సృష్టి అనేది శక్తివంతమైనది కూడా. క్రీస్తులో, క్రీస్తు స్వరూపంలోకి మార్చబడడం.

'థ్యాంక్‌గాడ్' అని అన్నాడు హానోక్. కాస్త సమయం గడిచిన తర్వాత ఏమైనా తింటుందేమో అడుగుదాం అని గోల్డీ దగ్గరికి మమ్మీ వెళ్ళింది. గోల్డీ ఇల్లంతా చక్కగా సర్దేపనిలో ఉంది. 'నీకెందుకీ శ్రమ' అని మమ్మీ అంటే, పట్టించుకోకుండా కిచెన్ కూడా సర్దేస్తానని చెప్పింది.

అవి అయిన తర్వాత గోల్డీ ఫోన్‌లో మాట్లాడుతుంది. ఎవరూ? అని మమ్మీ అడిగింది, నా జూనియర్‌కి సువార్త చెప్పాను. ప్రభువుని నమ్ముకొంది. ఫాలోఅప్ చేస్తున్నాను.

ఫర్వాలేదు, పాప ప్రభువు మీద ఆధారపడుతుంది. ప్రభువు పని చేస్తుంది. ఆమె భక్తి జీవితం చూచి లోలోన ఎంతో ఆనందిస్తూ మమ్మీ కన్నీటిని ఆపుకోలేకపోయింది.

సాయంత్రం కృతజ్ఞత కూడికకు అంకుల్, అంటీవాళ్ళు వస్తారు అని చెబితే, అవునా గుడ్ అంది గోల్డీ.



మీటింగ్‌లో ఏం షేర్ చేయాలి? పాప క్షేమంగా వచ్చింది, ఆరోగ్యంగా ఉంది. చదువు పూర్తయి ఉద్యోగం కూడా వచ్చిందని చెప్పాలా? లేక తన ప్రార్థనా జీవితం, వాక్య జ్ఞానం, క్రమశిక్షణ, అందరి పట్ల ప్రేమ, ఆత్మలో అభివృద్ధి, ఆత్మల పట్ల భారం గురించి చెప్పాలా? మీమాంసలో పడిపోయింది మమ్మీ. పాప జీవితంలో జరుగుచున్న వీటిని బట్టి ప్రాముఖ్యంగా దేవునికి కృతజ్ఞతలు చెల్లించండి అని అడగడం ఉత్తమం అని మమ్మీకి అర్థమైంది.

భోజన సమయంలో పెళ్ళి ప్రస్తావన తెద్దాం అనుకున్న డాడీకి అర్థమైపోయింది. దేవుని చిత్తం తెలుసుకోవడం గురించి తనకి చెప్పనవసరం లేదని.

ఇది క్రీస్తులో సృష్టించబడిన 'నా కుటుంబం' అని ఫిలిప్పీ 1:21 జ్ఞాపకం తెచ్చుకొంటూ, తనని, తన కుటుంబాన్ని కృతజ్ఞతార్పణగా ప్రభువుకు సమర్పించాడు గోల్డీ తండ్రి.

థ్యాంక్స్‌గివింగ్ మీటింగ్‌లో సందేశం ఇవ్వాలి. ఈ సారి కథానిక రూపంలో అందిస్తే అనే ఆలోచనకు రూపం ఇది.

చివరిగా, ప్రసంగానికి ముగింపు ఇస్తూ 2 థెస్స 1:3-5 నుండి నూతన పరచబడుచున్న మన జీవితాలు, ఆనందంతో కృతజ్ఞతలు చెల్లించడానికి కారణాలు కావాలి. ఫలాని వారి వల్ల మా జీవితాలు మారాయి అనేలా ఉండాలి. 1 కొరింథీ 2:1-2 ప్రకారం మన నిర్ణయాలు, ఇతరులకు సందేశం కావాలి అని చెప్పి సందేశాన్ని ముగించాడు.

**– బిజే శ్రీకాంత్,** మచిలీపట్నం

Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No.: **GTR/59/2024-2026**

**Date of Printing: 25-01-2026**
**Date and place of posting: 27th and 28th of every month at GUNTUR RMS**

Vidyardhi Jwala is published by Mr. Ravipalli Srinivasa Rao, from # 19-37, Abhishek Nagar, Nambur - 522 508, Guntur District, Andhra Pradesh on behalf of Union of Evangelical Students of India (UESI) edited by Mr. Pilli Sunil Jacob and printed by Mr. Bhashyam Hanumantha Rao at Bhashyam Publishers, Plot No. B2, Ind. Estate, Backside of Bajaj Showroom, Amaravati Road Guntur 522 034, Guntur District, Andhra Pradesh



# యెహోవా పరిశుద్ధుడు

నాడు యెహోవా పరిశుద్ధుడు అని
అహరోను నుదిటిపై ముద్ర
నేడు రాజులైన యాజకులందరికీ
అంతరంగ ఫాలము మీద
పరిశుద్ధాత్మని ముద్ర
నాటి ప్రజలు అద్భుతాలు చూడాలంటే
పవిత్రతే మార్గం అని చెప్పిన
యెహోషువ ఒక్కడే...
నేడు ఉప్పునీటిలోని చేపలా ఉండాలని
హెచ్చరించే దైవిక నాయకులెందరో!

అరికాలి నుండి నడినెత్తిదాకా
అణువంతైనా మంచిలేదు
నీరెండకు మెరిసే చిగురుటాకులా
నిర్మలంగా ఉండడం సాధ్యమేనా?
తరాలెన్ని మారినా
తనువంతా తిమిరమే
తలవంపులు తెచ్చే
తలంపుల శుద్ధి సంభవమా?

నాలో పాపముంటే చూపించండని
సవాలు విసిరిన
పరిశుద్ధుడైన యేసులా
క్షణికానందం కంటే
పవిత్రతే ప్రధానమని
పారిపోయిన యోసేపులా
నోరూరించే రాజ భోజనం వద్దని
అమలినంగా ఉన్న దానియేలుగా
ప్రభువు సన్నిధి స్పృహతోనే
స్వచ్ఛమైన మనస్సాక్షి సాధ్యం!

ఉరుములు మెరుపులు
బూరశబ్దం సాంద్రమేఘం
నాటి సీనాయి శిఖరం...
వాక్యధ్యానం ప్రార్థన సహవాసం
నేటి పరిశుద్ధ పర్వతం...
రోషం గల దేవుని ఉగ్రత
తప్పించుకోవాలంటే
ప్రభువు కోసం ప్రతిష్టించుకోవాలి
ప్రభువు మాదిరినే అనుసరించాలి
ఒకరినొకరు ప్రేమగా పురికొల్పుకోవాలి!

– గొంగటి మేరీజాయ్, ఆదోని